Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 232 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 24 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## శబరిమల కేసు.. జస్టిస్ నాగరత్న కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** శబరిమలలో మహిళలకు ప్రవేశంపై గురువారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. 9 మంది సభ్యుల ధర్మాసనం ఎదుట సుదీర్ఘ వాదనలు నడిచాయి. విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. 'వాట్సాప్ యూనివర్సిటీ'పై సెటైర్లు వేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26ల మధ్య సమతుల్యత ఉండాలని సీనియర్ అడ్వకేట్ నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. ఏ మూల నుంచైనా, ఏ విశ్వవిద్యాలయం నుంచైనా వచ్చే జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని ఆహ్వానించాలని అన్నారు. దీనిపై జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ.. 'కానీ.. వాట్సాప్ యూనివర్సిటీ నుంచి మాత్రం కాదు' అంటూ చమత్కరించారు. తప్పుడు సమాచారం ప్రబలుతున్న ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా సమాచారాన్ని కోర్టులు పరిగణనలోకి తీసుకోకూడదనే అర్థంలో జస్టిస్ నాగరత్న ఈ వ్యాఖ్యలు చేశారు. సామాజిక సంస్కరణల పేరుతో మతపరమైన ప్రాథమిక హక్కులను కాలరాయలేరని న్యాయవాది కౌల్ వాదించారు. 'రాజ్యాంగ నైతికత' అనేది అస్పష్టమైన పదమని, మత విశ్వాసాలను దీనితో కొలవలేమని దావూదీ బోహ్రా వర్గం న్యాయవాది అన్నారు. జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. మతపరమైన హక్కులు ఎప్పుడూ నైతికత, ప్రజారోగ్యం, శాంతిభద్రతలకు లోబడే ఉంటాయని గుర్తు చేశారు.

## రైలు పట్టాల ఆధునికీకరణ



భారతదేశ అంతటా రోజూ 25,000 కంటే ఎక్కువ రైళ్లు ప్రయాణిస్తూ, నిత్యం 2 కోట్ల మందికి పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. అలాగే.. బొగ్గు, ఇనుప ఖనిజం, ధాన్యం, ఉక్కు, సిమెంట్ వంటి అనేక వస్తువులను 1,37,000 కిలోమీటర్లకు పైగా విస్తరించిన సుదీర్ఘ ట్రాక్ నెట్వర్క్ ద్వారా రవాణా చేస్తున్నాయి. రైల్వే వ్యవస్థ మొత్తానికి రైల్వే ట్రాక్ పునాది లాంటిది. ట్రాక్ బాగుంటేనే రైళ్లు సురక్షితంగా, వేగంగా ప్రయాణిస్తాయి. ఒకవేళ పట్టాలు సరిగ్గా లేకపోతే వేగ పరిమితులు, ప్రయాణంలో ఆలస్యంతో పాటు భద్రతా పరమైన ముప్పులు కూడా పొంచి ఉంటాయి. ముఖ్యంగా పట్టాలలో పగుళ్లు, బోల్టులు వదులు అవ్వడం లేదా పట్టాల కింద ఉండే కంకర (బ్యాలస్ట్) పాడవ్వడం వంటివి రైళ్ల కదలికపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ట్రాక్ ప్రాముఖ్యతను గుర్తించిన భారత రైల్వే శాఖ, దాదాపు పదేళ్ల క్రితమే సమగ్రమైన ట్రాక్ ఆధునీకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా పాత పట్టాల స్థానంలో కొత్తవి వేయడం, అత్యాధునిక యంత్రాలతో తనిఖీలు చేయడం, మెకనైజ్డ్ మెయింటెనెన్స్, రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టారు. ఈ ప్రయత్నాల వల్ల ప్రస్తుతం రైల్వే నెట్వర్క్ స్థితిగతుల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. 2014 నుంచి ఇప్పటివరకు సుమారు 55,000 కిలోమీటర్ల మేర పట్టాలను మార్చారు. దీనివల్ల భద్రత పెరగడమే కాకుండా ప్రయాణం సాఫీగా సాగుతోంది. తరచుగా మరమ్మతులు చేయాల్సిన అవసరం తగ్గింది. దాదాపు 44,000 కిలోమీటర్ల మేర ఒక్కొక్కటి 260 మీటర్ల పొడవున్న రైల్ ప్యానెల్స్ను వేశారు. పట్టాల మధ్య జాయింట్లు తక్కువగా ఉండటం వల్ల రైళ్లు సురక్షితంగా, కుదుపులు లేకుండా కదులుతున్నాయి. అలాగే భారీ లోడ్లను తట్టుకోవడానికి, అధిక వేగాన్ని తట్టుకునేలా 80,000 కిలోమీటర్ల మేర బలమైన 60-కేజీ పట్టాలను ప్రస్తుతం వాడుతున్నారు. బలమైన పట్టాలను వేయడమే కాకుండా, లోపాలను ముందే గుర్తించడంపై కూడా రైల్వే ప్రత్యేక దృష్టి సారించింది. దీని కోసం అల్ట్రాసోనిక్ ఫ్లా డిటెక్షన్ (ఖూఖీణ) పరీక్షలను సుమారు 36.2 లక్షల కిలోమీటర్ల ట్రాక్, 2.25 కోట్ల వెల్డింగ్ జాయింట్లపై నిర్వహించారు. బయటకు కనిపించని లోపాలను ఈ పరీక్షల ద్వారా గుర్తించడం వల్ల, పట్టాలు, వెల్డింగ్ విఫలమవ్వడం వంటి ఘటనలు 90% వరకు తగ్గాయి. ఇది సమస్య తలెత్తిన తర్వాత సరిచేయడం కంటే, రాకముందే నివారించే పద్ధతికి నిదర్శనం. వీటితో పాటు వెల్డింగ్ నాణ్యతను పరీక్షించడానికి ఫేజ్డ్-అరే టెస్టింగ్, మాగ్నెటిక్ పార్టికల్ ఇన్స్పెక్షన్ వంటి పద్ధతులను వాడుతున్నారు. అలాగే ప్రయాణ నాణ్యతను కొలవడానికి, పట్టాలలో సమస్య ఉన్న ప్రాంతాలను కచ్చితంగా గుర్తించడానికి జిపిఎస్ ఆధారిత ఆసిలేషన్ మానిటరింగ్ సిస్టమ్స్ను కూడా ప్రస్తుతం ఉపయోగిస్తున్నారు. ట్రాక్ మెషిన్ల సంఖ్య 2014లో 748 ఉండగా, 2026 నాటికి అవి 1,785కు పెరిగి రెట్టింపు కంటే ఎక్కువైయ్యాయి. ఈ యంత్రాలు టాంపింగ్, బ్యాలస్ట్ క్లీనింగ్ మరియు రైల్ గ్రైండింగ్ వంటి పనులను మాన్యువల్ పద్ధతి కంటే మెరుగ్గా, వేగంగా, సమానంగా నిర్వహిస్తాయి. ముఖ్యంగా పట్టాల కింద ఉండి, నీరు నిలవకుండా చూస్తూ, కంపనాలను గ్రహిస్తూ ట్రాక్ స్థిరంగా ఉండేలా చేసే కంకర (బ్యాలస్ట్) పొరను శుభ్రం చేయడంలో ఈ యంత్రాలు గణనీయమైన మార్పును తెచ్చాయి. కాలక్రమేణా రైళ్ల బరువు, కంపనాల వల్ల ఈ కంకర రాళ్లు పొడిలా మారి, ఆ పొర మూసుకుపోయి దాని సామర్థ్యం తగ్గుతుంది. స్క్రీనింగ్ ప్రక్రియ ట్రాక్ బెడ్ను తిరిగి సరైన స్థితికి తీసుకువస్తుంది. ఇప్పటివరకు లక్ష కిలోమీటర్లకు పైగా ఈ పనిని ప్రధానంగా యంత్రాల ద్వారానే పూర్తి చేశారు. పట్టాల ఉపరితల లోపాలను తొలగించి, తద్వారా ప్రయాణ నాణ్యత, భద్రతను మెరుగుపరచడానికి లక్ష కిలోమీటర్లకు పైగా రైల్ గ్రైండింగ్ పనులు చేపట్టారు. ఏటా రైళ్ల రాకపోకలు పెరుగుతుండటంతో, రైళ్ల మధ్య మరమ్మతుల కోసం లభించే సమయం తగ్గుతోంది. రైళ్ల రాకపోకలకు ఆటంకం కలగకుండా తక్కువ సమయంలో ఎక్కువ పనిని పూర్తి చేయడానికి ఈ యంత్రాలు సహాయపడుతున్నాయి. అయితే.. భద్రత అనేది రైళ్లు పాయింట్లు, క్రాసింగ్లను ఎలా దాటుతాయనే దానిపై కూడా ఆధారపడి ఉంటుంది. అందుకే ట్రాక్ నవీకరణతో పాటు మరికొన్ని అనుబంధ భద్రతా చర్యలను భారత రైల్వే చేపట్టింది. ముఖ్యంగా గంటకు 110 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో రైళ్లు ప్రయాణించే చోట, మనుషులు, పశువులు పట్టాలపైకి రాకుండా నిరోధించడానికి సుమారు 17,500 కిలోమీటర్ల మేర భద్రతా కంచెలను ఏర్పాటు చేశారు. పాయింట్లు మరియు క్రాసింగ్ల వద్ద 36,000 థిక్-వెబ్ స్విచ్లు, 7,500 వెల్డబుల్ సి.ఎం.ఎస్ క్రాసింగ్లను అందించారు. ఇవి ఎక్కువ కాలం మన్నడమే కాకుండా రైళ్లు సాఫీగా వెళ్లడానికి తోడ్పడతాయి. 2019లో ప్రవేశపెట్టిన వెడల్పైన, బరువైన స్లీపర్లు ముఖ్యంగా వేసవి వేడి సమయంలో స్థిరత్వాన్ని మెరుగుపరుస్తాయి. గిర్డర్ వంతెనలపై హెచ్-బీమ్ స్లీపర్లు, యార్డుల గుండా వేసిన పొడవైన వెల్డెడ్ పట్టాలు ఈ నెట్వర్కును మరింత బలోపేతం చేశాయి. ట్రాక్ ఆధునీకరణ వల్ల లభించిన అత్యంత స్పష్టమైన ఫలితాలలో ఒకటి రైళ్ల వేగ సామర్థ్యం పెరగడం.

| వేగం | 2014- రన్నింగ్ ట్రాక్ కి.మీ. | | 2026 రన్నింగ్ ట్రాక్ కి.మీ. | |
|---|---|---|---|---|
| 130 & ఆపైన | 5,036 | 6.3 | 24,173 | 22.5 |
| 110 - 130 | 26,409 | 33.3 | 62,482 | 58.2 |
| కింద 110 | 47,897 | 60.4 | 20,679 | 19.3 |
| మొత్తం | 79,342 | 100 | 1,07,334 | 100 |

గంటకు 130 కిలోమీటర్లు, అంతకంటే ఎక్కువ వేగాన్ని తట్టుకోగల పట్టాల శాతం 6% నుంచి దాదాపు 23%కి పెరిగింది. అలాగే 110 కిలోమీటర్లు, అంతకంటే ఎక్కువ వేగానికి సరిపడే పట్టాలు 40% నుంచి 80%కి పెరిగాయి. దీనివల్ల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, రైళ్లు సమయపాలన పాటించడం మెరుగుపడింది. వందే భారత్ ఎక్స్ప్రెస్ వంటి సెమీ-హై-స్పీడ్ రైళ్లను నడపడం సాధ్యమైంది. ఈ ఆధునీకరణ చర్యల ఉమ్మడి ప్రభావం భద్రతా గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. పర్యవసానంగా.. రైలు ప్రమాదాల సంఖ్య 2014-15లో 135 ఉండగా, 2025-26 నాటికి 16కి తగ్గింది - అంటే దాదాపు 89% తగ్గుదల నమోదైంది. ప్రతి మిలియన్ రైలు కిలోమీటర్లకు ప్రమాదాల రేటు 0.11 నుంచి 0.01కి మెరుగుపడింది, ఇది 90% మెరుగుదల. ట్రాఫిక్ పెరిగిన కాలంలోనే ఇది సాధ్యపడింది: అంటే ఎక్కువ రైళ్లు, ఎక్కువ మంది ప్రయాణికులు ఉన్నప్పటికీ తక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెబ్ ఆధారిత ట్రాక్ మేనేజ్మెంట్ సిస్టమ్ ఇప్పుడు అల్ట్రాసోనిక్ పరీక్షలు, ప్రయాణ నాణ్యత రీడింగులు, ట్రాక్ జియోమెట్రీ డేటాను ఒకే వేదికపైకి తీసుకు వచ్చింది. దీనివల్ల ప్రాధాన్యతలను నిర్ణయించడం, సకాలంలో చర్యలు తీసుకోవడం సులభతరమైంది. పన్నెండేళ్ల క్రితం, భారతదేశంలోని 60% రైల్వే ట్రాక్ గంటకు 110 కిలోమీటర్ల కంటే తక్కువ వేగానికే పరిమితమై ఉండేది, పట్టాల విరుపులు సాధారణం, నిర్వహణ అంతా మాన్యువల్గా సాగేది. కానీ నేడు, దాదాపు 80% నెట్వర్క్ 110 కిలోమీటర్లు లేదా అంతకంటే ఎక్కువ వేగాన్ని తట్టుకోగలదు, పట్టాలు, వెల్డింగ్ వైఫల్యాలు 90% తగ్గాయి, దాదాపు 1,800 ట్రాక్ మెషీన్లు పనిలో ఉన్నాయి. రైలు సరుకు రవాణాపై ఆధారపడే లక్షలాది మంది ప్రయాణికులకు, వ్యాపారాలకు ఈ మార్పులు నిజమైన వ్యత్యాసాన్ని చూపుతున్నాయి. సాఫీ ప్రయాణాలు, తక్కువ ప్రయాణ సమయం, నమ్మదగిన నెట్వర్క్ అందుబాటులోకి వచ్చింది. ఈ పని ఇంకా పూర్తి కాలేదు, కానీ నిరంతర కృషి, పెట్టుబడి ఏం సాధించగలవో ఈ పురోగతి చూపిస్తోంది.

**రచయిత: శ్రీ అశ్విని వైష్ణవ్ (కేంద్ర రైల్వే, సమాచార & ప్రసార మరియు ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి)**






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ సోలార్ ఎనర్జీ సంస్థ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు. కార్యక్రమంలో పాల్గొన్న రెన్యూ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా, స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఎంపీ రమేష్ పలువురు ప్రజాప్రతినిధులు.

## 2027 నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని సీఎంకు వివరించిన బిట్స్ పిలానీ సంస్థ ప్రతినిధులు

### - సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశమైన బిట్స్ పిలాని ప్రతినిధులు




**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజధాని ప్రాతంలో నిర్మితం అవుతున్న బిట్స్ పిలాని క్యాంపస్ పురోగతిపై ముఖ్యమంత్రికి వివరించిన ఆ సంస్థ ప్రతినిధులు. రాజధానిలో నిర్మిస్తున్న క్యాంపస్లో క్వాంటం, ఏఐ విభాగాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రికి తెలిపిన బిట్స్ పిలాని ప్రతినిధులు. క్వాంటం టెక్నాలజీ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన. ఐకానిక్, ఏఐ క్యాంపస్‌గా అమరావతి బిట్స్ పిలాని క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్టు వెల్లడి.
2027 నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని సీఎంకు వివరించిన బిట్స్ పిలానీ సంస్థ ప్రతినిధులు. రాజధాని ప్రాంతంలోని క్యాంపస్ సహా సంస్థ విస్తరణ కోసం రూ.250 కోట్ల మేర వ్యయం చేయనున్నట్టు తెలిపిన బిట్స్ పిలాని ప్రతినిధులు. మూడు దశల్లో బిట్స్ పిలాని అమరావతి క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపిన ఆ సంస్థ ప్రతినిధులు. మొత్తం 10 వేల మంది విద్యార్థులు చదువుకునేలా క్యాంపస్ నిర్మిస్తున్నట్టు వెల్లడి.

## కేంద్ర ప్రభుత్వ ఐకాప్స్ నిర్వహణకు సీబీసీ టెండరు




**విజయవాడ, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రధాన పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు మరియు ఇతివృత్త ఆధార అంశాల మీద సమీకృత సమాచార మరియు ప్రచార కార్యక్రమం నిర్వహించడానికి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ టెండర్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ఈవెంట్ మేనేజ్ మెంట్ సంస్థల నుంచి కొటేషన్లను మే నెల 5వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్టు సీబీసీ డైరెక్టర్ జి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సీబీసీ ప్రకటించిన ఎంపానెల్‌మెంట్ వివరాలు, టెండర్ ప్రక్రియలో పాల్గొనే సంస్థలకు కావలసిన అర్హతలు, ఇతర నిబంధనలను https://eprocure.gov.in/epublish/app లో టెండర్ ఐడి 835410_2 ద్వారా లేదా https://cbcindia.gov.in/ పోర్టల్ లో ప్రచురించిన టెండర్ నోటీసులో కూడా పొందవచ్చని ఆయన తెలిపారు. ఎంపానెల్‌మెంట్ ద్వారా ఎంపికైన సంస్థలు ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రచార కార్యక్రమాలు, ప్రదర్శనలు, సదస్సులు నిర్వహించ వలసి ఉంటుందని సురేష్ కుమార్ తెలిపారు. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల కింద నమోదైన సంస్థలకు నిబద్ధత సొమ్ము నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు. కనిష్ఠ ధర పలికిన సంస్థకు ఇచ్చే అరవై శాతం పనులు పోను, టెండరు ప్రక్రియలో విజయవంతంగా పాల్గొన్న సంస్థలన్నింటికీ మిగిలిన పనిని సమానంగా చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. సంస్థల పనితీరును బట్టి, పరస్పర అంగీకారంపై ఎంపానెల్‌మెంట్ మరో ఏడాది పొడిగించే అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. ఈనెల 30వ తేదీన ప్రీబిడ్ సమావేశం నిర్వహించి టెండర్ ప్రక్రియలో పాల్గొనే సంస్థలకు ICOP కార్యక్రమాల వివరాలు, సంస్థల బాధ్యతలను వివరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో నమోదైన, ఆసక్తిగల సంస్థలు టెండరు ప్రక్రియలో పాల్గొనాలని సురేష్ కుమార్ విజ్ఞప్తి చేసారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతమే చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- స్వయం సహాయక సంఘాల విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు 1 కోటి 60 లక్షలు విలువ చేసే 185 5జి స్మార్ట్ ఫోన్ల అందజేత - నాడు చంద్రబాబు నాయుడు వేసిన డ్వాక్రా అనే బీజం నేడు మహావృక్షమై కోట్లాది మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది - 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు రికార్డు స్థాయిలో 291 కోట్ల 7 లక్షల రుణ సహాయాన్ని అందించాం - ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో మహిళా సాధికారతకు ఆద్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడేనన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కోవూరు పట్టణంలోని పివిఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు 5జి మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మహిళలకు స్ఫూర్తినిచ్చే వెలుగు ప్రార్థనా గీతంతో మొదలైన ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని 185 మంది విఓఎలకు అధునాతన 5+ స్మార్ట్‌ఫోన్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గారు వేసిన డ్వాక్రా అనే బీజం నేడు మహావృక్షమై రాష్ట్రంలోని కోట్లాది మంది ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపుతోందని కొనియాడారు. కుటుంబ నిర్వహణ మరియు పొదుపు చేయడంలో మహిళల నేర్పు ఓర్పుల గురించి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వివరించారు. మహిళలను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చి దిద్దిన ఘనత ఆయనకే చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, బుచ్చిరెడ్డి పాలెం మండలాలలో 5 వేల 885 స్వయం సహాయక సంఘాల్లోని 59 వేల 460 మంది మహిళా సభ్యులను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ మరియు సిఐఎఫ్ వంటి వివిధ పథకాల ద్వారా నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 291 కోట్ల 7 లక్షల రుణ సహాయాన్ని అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి కోవూరు నియోజకవర్గ ప్రజానీకం తరుపున ధన్యవాదాలు తెలియ చేసారు. చంద్రబాబు నాయుడు డిజిటల్ విజన్‌లో భాగంగానే ఈరోజు వీఓఏలకు 5+ మొబైల్స్ అందజేస్తున్నామని దీనివల్ల క్షేత్రస్థాయిలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. ఇకపై రికార్డుల నిర్వహణ కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదని, హైస్పీడ్ ఇంటర్నెట్‌తో నిమిషాల్లో వివరాలను ఆన్‌లైన్ చేయవచ్చని చెప్పారు. రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా అవినీతికి తావులేకుండా పారదర్శకత పెరుగుతుందని అలాగే మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెట్లలో ప్రదర్శించడానికి ఈ ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ప్రభుత్వ నిర్ణయాలు మరియు కొత్త జీవోలు వాట్సాప్ లేదా ప్రత్యేక యాప్‌ల ద్వారా నేరుగా సెకన్ల వ్యవధిలో ప్రతి సభ్యురాలికి చేరుతాయని తద్వారా సమాచార లోపం లేకుండా ప్రతి మహిళా సాధికారత సాధనలో భాగస్వామి అవుతుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేసారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళా సంఘాల పనితీరులో వేగం, పారదర్శకత పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం 5+ స్మార్ట్ ఫోన్లు అందచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందనన్నారు. అనంతరం డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజ కుమారి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల పురోగతి వివరించారు. ప్రభుత్వం యిచ్చే రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు మధుసూదన్, మురళి ఎంపీడీఓ శ్రీహరి, కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఎపిఎంలు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లతో పాటు స్థానిక టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరా నిర్వహణ తీరును పరిశీలించిన కమిషనర్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణ భాగంగా స్థానిక 39 వ డివిజన్ మూలాపేట, రాజా రామ్ మోహన్ రాయ్ పార్కు వీధి, శివాలయం వీధి, వేణుగోపాస్వామి వీధి, రాజా వారి వీధి పరిసర ప్రాంతాలలో పబ్లిక్ హెల్త్ విభాగం, మెగా ఇంజనీరింగ్ వర్క్స్ ఇంజనీర్లు, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని సురక్షిత తాగునీటి సరఫరా నిర్వహణ తీరును కమిషనర్ పర్యవేక్షించారు. తాగునీటి సరఫరాపై స్థానిక ప్రజలతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి నాణ్యతను స్థానిక ప్రజల సమక్షంలోనే కమిషనర్ పరీక్షలు జరిపి ఫలితాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించే భవనాలకు సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు మేరకు మాత్రమే నిర్మాణాలను చేపట్టే విధంగా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా డివిజన్ పరిధిలోని అన్ని రోడ్లను ఎండ్ టు ఎండ్ పరిశుభ్రంగా ఉంచేలా ప్రతిరోజు చర్యలు తీసుకోవాలని డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ వ్యర్థాల ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా చేపట్టేలా శానిటేషన్ విభాగం అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఒక్క భవనాన్ని అసెస్మెంట్ పరిధిలోకి తీసుకువచ్చి డిమాండ్ విధించాలని, ప్రతి ఒక్క ఆస్తికి సంబంధించిన పన్నులను బకాయిలు లేకుండా పూర్తిస్థాయిలో వసూలు చేయాలని కమిషనర్ సూచించారు. ఈనెల 30 వ తేదీ వరకు వడ్డీ పై 50% రాయితీ, ముందస్తు పన్ను చెల్లింపు పై 5 శాతం రిబేటు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, మెగా ఇంజనీరింగ్ సంస్థ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లూరులో జరుగుతున్న అవినీతికి మంత్రి నారాయణ సమాధానం చెప్పలేక కూటమి నేతలతో అవాకులు చవాకులు మాట్లాడిస్తుండడం సరికాదు : వైసిపి స్టేట్ బీసీ సెల్ ఉపాధ్యక్షురాలు మల్లి నిర్మల




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రాంజీ నగర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో వైసిపి స్టేట్ బీసీ సెల్ ఉపాధ్యక్షురాలు మల్లి నిర్మల పాత్రికేయ సమావేశం నిర్వహించి మాట్లాడారు.

మల్లి నిర్మల కామెంట్స్ ..

నెల్లూరు నగరంలో జరుగుతున్న అవినీతిపై మా నాయకులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రాజీ లేని పోరాటం చేస్తున్నారని అన్నారు. చంద్రశేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కూటమి నేతలు దాటవేసే ధోరణిలో మాట్లాడుతున్నారని అన్నారు. మంత్రి నారాయణని సూటిగా ఒకటే ప్రశ్నిస్తున్నాను. మా నాయకులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రాజకీయాల్లోకి వచ్చి రెండున్నర సంవత్సరమే కావచ్చు.. అంతమాత్రాన అవినీతి గురించి ప్రశ్నించకూడదా సమాధానం చెప్పాలన్నారు. మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు.. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండగా మంత్రి నారాయణ ఒక్క రోజైనా రోడ్డు మీదకు వచ్చి ప్రజల కోసం.. పోరాటం చేశారా చెప్పాలన్నారు. ఈరోజు మా నాయకులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి శాసనమండలి సభ్యులుగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర్ నియోజకవర్గ ఇన్చార్జిగా..ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారని అన్నారు. పార్టీ అధిష్టానం ఏ కార్యక్రమం చేపట్టమన్న ఆ కార్యక్రమాన్ని.. చిత్తశుద్ధితో నిర్వహిస్తూ.. దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారు.. మా నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి అని అన్నారు. చంద్రశేఖర్ రెడ్డి రాజకీయాల్లో ఎలా మాట్లాడాలో కూడా కూటమి నేతలే.. చెబుతున్నారని ఇది విడ్డూరంగా ఉందన్నారు. మా నాయకులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు కూటమి నేతలకి గుండెల్లో గుణపాల్లా గుచ్చుకుంటున్నాయి కాబోలు.. అందుకే వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా టిడిపిలో టక్కు టమారా విద్యలు తెలిసిన నాయకులు చంద్రశేఖర్ రెడ్డి గురించి.. మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని అన్నారు. నెల్లూరులో జరుగుతున్న అవినీతి గురించి సమాధానం చెప్పే ధైర్యం లేక మంత్రి నారాయణ.. కూటమి నేతల చేత అవాకులు చవాకులు మాట్లాడిస్తున్నారని అన్నారు. నెల్లూరు నగరంలో చెట్లు నాటే విషయంలో 12 వేల రూపాయలు.. ఖర్చు చేస్తున్నారు.. ఇది ప్రజాధనం దుర్వినియోగం ఇది పెద్ద అవినీతి.. అని మా నాయకులు చంద్రశేఖర్ రెడ్డి వాస్తవాలను బయటపెట్టారని అన్నారు. మంత్రి నారాయణ అవినీతి.. జరగలేదని ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు చూపలేక పోయారని అన్నారు. ఒకొక్క చెట్టుకు 5వేల రూపాయలు.. ఖర్చు చేయడానికి.. పూర్తిగా.. అనుమతులు తీసుకొని.. చంద్రశేఖర్ రెడ్డి ప్రశ్నించేసరికి.. పొంతన లేని మాటలతో టిడిపి నేతలు వరుస ప్రెస్ మీట్‌లు పెట్టి మాట్లాడుతున్నారని అన్నారు. అలాగే చెట్లు.. నిర్వహణ కోసం.. 7 వేల రూపాయలు ఖర్చు చేయాలని.. ఎస్టిమేషన్స్ రూపొందించిన మాట వాస్తవం కాదా చెప్పాలన్నారు. దీనిపై మంత్రి నారాయణ ప్రమాణం చేసి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇది అబద్ధం అని నిరూపించండి.. రాజకీయ సన్యాసం చేస్తామని.. కూటమిలో కొంతమంది మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

ఇంటి పన్నులు కట్టలేదని ప్రజలను లోక్ అదాలత్.. కోర్టులకు లాగిన ఘనత కూటమి నేతలదన్నారు.

వి ఆర్ స్కూల్లో మరో దోపిడీకి కూటమినేతలు తెరతీసారన్నారు. 15 కోట్ల రూపాయలు సిఎస్ఆర్ ఫండ్స్ కింద విఆర్ స్కూల్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పి ఈరోజు 10 కోట్ల రూపాయలను.. కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి కేటాయించుకునేందుకు.. కూటమి నేతల సిద్ధమైన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇలా నెల్లూరు నగరాన్ని.. టిడిపి ప్రభుత్వం అవినీతి మయంగా మార్చి పెద్ద ఎత్తున దోపిడీకి తెరలేపిందన్నారు. ఎక్కడ అవినీతి జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందని.. మా నాయకులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. దీనిపై పోరాటాలు చేయడానికి వెనక్కి దగ్గరన్న విషయాన్ని కూటమి నేతలు గుర్తించుకోవాలన్నారు.

# నాదెండ్ల మనోహర్‌ను ఫోన్లో పరామర్శించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు నిన్న(బుధవారం) కన్నుమూసిన సంగతి తెలిసిందే. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. భాస్కరరావు మరణంపై తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం ఏపీ కేబినెట్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారు. నాదెండ్ల మనోహర్‌ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోన్లో పరామర్శించారు. శస్త్రచికిత్స జరగటంతో బయటకు రాలేని పరిస్థితిలో నాదెండ్ల భాస్కరరావు అంత్యక్రి యల్లో పాల్గొనలేకపోతున్నానని మంత్రి నాదెండ్ల మనోహర్‌కు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ విషాదం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భాస్కరరావు మృతికి పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. 1935 జూన్ 23న గుంటూరులో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. ఆయన వృత్తిరీత్యా లాయర్ కాగా.. కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆయన 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధిం చారు. అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు. నాదెండ్ల భాస్కరరావు కాంగ్రెస్ పార్టీని వీడి 1982లో ఎన్టీఆర్ వెంట నడిచారు. తెలుగు దేశం పార్టీ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం నాదెండ్ల భాస్కరరావు రాజకీయ వారసుడిగా కుమారుడు మంత్రి నాదెండ్ల మనోహర్ కొనసాగుతున్నారు.

# మహిళా రిజర్వేషన్‌ను అడ్డుకున్న టీఎంసీకి శిక్ష విధించాలి : ప్రధాని మోదీ



**ఇంటర్నెట్ డెస్క్:** గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు. ఎన్నికల ప్రచార సభకు బెంగాల్ ప్రజలు, బీజేపీ కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. టీఎంసీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టీఎంసీ, కాంగ్రెస్ కలిసి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నారని ప్రధాని మోదీ అన్నారు. 'మహిళా రిజర్వేషన్‌ను అడ్డుకున్న టీఎంసీకి శిక్ష విధించాలి. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తున్న ఈసీకి అభినందనలు. బెంగాల్‌లో టీఎంసీ జంగిల్ రాజ్ ముగిస్తున్నాం. మమత పాలనలో ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. మమత చేసిన దుర్మార్గాలపై విచారణ చేస్తాం. బెంగాల్‌లోకి చొరబాటుదారులను టీఎంసీ ప్రోత్సహిస్తుంది. సరిహద్దు భద్రతను, ప్రమాదంలో పడేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టిఎంసి అవినీతిని కక్కిస్తాం' అని మోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ ఓటింగ్ ఇవాళ (ఏప్రిల్ 23) జరుగుతోంది. తొలి దశలో 152 స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తో న్నారు. మిగిలిన ప్రాంతాలలో ఏప్రిల్ 29న ఓటింగ్ జరుగనుంది. రెండో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ బెంగాల్లో పర్యటించారు. ఈ ఎన్నికల ఫలితాలు మే 4న ప్రకటిస్తారు.

# చదువుతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం

## - నారాయణ సీబీఎస్ఈ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** చదువుతోనే ఉన్నత లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ అజిత వెజెండ్ల పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం నగరంలోని స్థానిక ధనలక్ష్మీ పురం నందు గల వావిలేటిపాడు రోడ్డులోని నారాయణ రత్నం సిబిఎస్ఈ స్కూల్ రెసిడెన్షియల్ విద్యార్థుల వార్షికోత్సవ వేడుకలకు ఎస్పీ అజిత వేజెండ్ల, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రెడ్డి విజయభాస్కర్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు నారాయణ ఉద్యో గులు, సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించినందుకు చదువు ఒక్కటే మార్గమన్నారు ఆ దిశగా కృషి చేస్తున్న నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం అభినందనీయమని కొనియాడారు. అనంతరం వేదిక పైన నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నారాయణ సీబీఎస్ఈ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యతోనే ఏదైనా సాధ్యమని నారాయణ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పొంగూరు నారాయణ శ్రమఏవ జయతే నినాదంతో నారాయణ విద్యాసంస్థలను స్థాపించడం జరిగిందన్నారు. విద్యార్థులకు మంచి విద్యనందిస్తూ వారి ఉన్నతికి దోహదపడుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కోర్ డీన్ జయ కుమార్ రాయుడు, ఏ జి ఎం రవివర్మ, ప్రిన్సిపల్స్ కిరణ్ కుమార్, మోపిదేవి నాగమణి, మధుసూదన్ రెడ్డి, ఉద్యోగులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు

# గత ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం..
# కూటమి పాలనలో అభివృద్ధి పనుల వేగం

**- కోవూరులో 2 కోట్ల 75 లక్షలతో వోల్టేజీ సమస్యకు చెక్ - రికార్డు స్థాయిలో 56 సి.సి రోడ్ల నిర్మాణం - సిఎంఆర్ఎఫ్ ద్వారా అనారోగ్య బాధితులకు 72 లక్షల 90 వేల ఆర్థిక సహాయం - కోవూరు 3 వ వార్డు పర్యటనలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు పంచాయతీలోని 3వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప, గత ఐదేళ్లలో కోవూరు పట్టణాభివృద్ధి అడుగు కూడా ముందుకు పడలేదని మండిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 22 నెలల కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కోవూరు అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు ఆమె వివరించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ మరియు జిల్లా పరిషత్ గ్రాంట్ల కింద సుమారు 1 కోట్ల 79 లక్షలు వెచ్చిచి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపామన్నారు. ఎంపీ బీదా మస్తాన్ రావు నిధులు 50 లక్షల రూపాయల ఎంపి లాడ్స్ నిధులతో పీటర్ కెనాల్ వంతెన నిర్మాణం, ఎఫ్.డి.ఆర్ నిధులతో చెరువు కట్టల బలోపేతం, కాలువల పూడికతీత మరియు కల్వర్టుల నిర్మాణం కోసం దాదాపు 1 కోటి 50 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ లో-వోల్టేజీ సమస్య నివారణకు 15 కొత్త ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మార్పిడి మరియు ఆర్.డి.ఎస్.ఎస్ పనుల కోసం మొత్తం 2 కోట్ల 75 లక్షలు వినియోగించినట్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వివరించారు. పంచాయతీ రాజ్ విభాగం ద్వారా జరిగిన ప్రగతిని వివరిస్తూ.. విలేజ్ హెల్త్ సెంటర్లు, కోర్టు భవనాలు, రీడింగ్ రూమ్‌లతో పాటు ఉపాధి హామీ మరియు సాధారణ నిధులతో రికార్డు స్థాయిలో 2 కోట్ల80 లక్షలతో 56 సి.సి రోడ్లను నిర్మించామన్నారు. సామాజిక బాధ్యతగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 61 మంది లబ్ధిదారులకు 72 లక్షల 90 వేల విలువైన చెక్కులను అందించినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే కోవూరు సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు తెలుగుదేశం, బిజెపి, జనసేన ముఖ్య పాటు నాయకులతో పెద్ద సంఖ్యలో కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

# “రఘు నూరు సరాలు” పుస్తకావిష్కరణ









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని మినీ టౌను హాలునందు డాక్టర్ రాచపాళెం రఘు రచించిన “రఘు నూరు సరాలు” పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. పద్య కళాపరిషత్ అధ్యక్షులు కీర్తి శేషులు మెట్టు రామచంద్ర ప్రసాద్ స్మారకార్థం ఆయనకు ఈ పుస్తకాన్ని అంకితం చేశారు. ముందుగా మెట్టు రామచంద్ర ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశ నాయకుల, చరిత్రకారుల చిత్రపటాల ప్రదర్శన జరిగింది. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సెంట్రల్ జి.ఎస్.టి.అసిస్టెంట్ కమీషనర్ డాక్టర్ సి. హెచ్.ఉషా కిరణ్, నెల్లూరు జిల్లా క్రైం రికార్డ్స్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.రామారావు, పుస్తక సమీక్షకులు డాక్టర్ కె.లక్ష్మీ నారాయణ రెడ్డి, ఎ.జయప్రకాశ్, షేక్ రియాజ్ బాషా, మెట్టు స్వరాజ్య లక్ష్మి, ఎన్.బాలరామయ్య నాయుడు, శింగంశెట్టి మురళీమోహన్ రావు, మురళీమోహన్ రాజు, రచయిత డాక్టర్ రాచపాళెం రఘు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

# నిషేధిత రసాయనాలతో పండ్ల పండింపుపై కఠిన చర్యలు తప్పవు

## - జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు హెచ్చరిక




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా నిషేధిత రసాయనాలతో పండ్లను కృత్రిమంగా పండించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో నగరంలోని పండ్ల వ్యాపారులు, సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అవగాహన సమావేశం నిర్వహించారు. తొలుత అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మామిడి, అరటి పండ్లను ఏ విధంగా కృత్రిమ పద్ధతుల్లో మగ్గబెట్టాలి, ఎలాంటి పద్ధతుల్లో మగ్గబెట్టకూడదో వివరించారు. జిల్లాలో కార్బయిడ్‌ను వ్యాపారులు ఎవరు కూడా వినియోగించకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. పండ్ల కృత్రిమ మగ్గింపునకు ఎతిలిన్ గ్యాస్ ఛాంబర్లు, ఎథిలిన్ సాచేట్లను ప్రభుత్వం నిబంధనలు మేరకు వినియోగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జైలు శిక్షతోపాటు 10 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కాల్షియం కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాల వినియోగం చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తూ, ఇటువంటి చర్యలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. పండ్లను సహజంగా లేదా నియంత్రిత ఎథిలిన్ గ్యాస్ పద్ధతిలో మాత్రమే పండించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండ్ల వ్యాపారులు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించి వినియోగదారులకు సురక్షితమైన పండ్లు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. గోదాములు, నిల్వ కేంద్రాల్లో శుభ్రత, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమ చర్యలను అరికట్టాలని ఆదేశించారు. ప్రజలు అసహజంగా మెరుస్తున్న లేదా త్వరగా పండినట్లు కనిపించే పండ్లపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులను వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం – ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంగా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పండ్ల కృత్రిమ మగ్గింపు పై పండ్ల వ్యాపారులకు ఉద్యానవన శాస్త్రవేత్తలతో ఒక అవగాహన సదస్సు నిర్వహించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, తూనికల కొలతల శాఖ అధికారి ఐజాక్, మార్కెటింగ్ శాఖ ఏడి అనిత, ఫుడ్ సేఫ్టీ అధికారులు, పండ్ల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చిరెడ్డిపాళెంలో టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని భగత్ సింగ్ కట్ట, రెయిన్బో స్కూల్ వీధికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త బత్తిన శ్రీనివాసులు - యమున దంపతుల కుమారుడు బత్తిన సుజయ్ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. విషయం తెలియగానే కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హుటాహుటిన బుచ్చిరెడ్డి పాలెం చేరుకున్నారు. శ్రీనివాసులు నివాసానికి వెళ్లి సుజయ్ మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుమారుడి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న బత్తిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చిన్న వయసులోనే కుమారుడు మృతి చెందడం అత్యంత బాధాకరమని పార్టీపరంగా మరియు వ్యక్తిగతంగా ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి భరోసా ఇచ్చారు.

# సంపాదకీయం

## ఆధిపత్యాలు లేని సమతుల్య సమాఖ్య

లక్ష్యం జనహితంగా ఉండడమే కాకుండా దాన్ని సాధించే పద్ధతులు ఆ ఆశయానికి నిబద్ధమయ్యే నైతిక నిష్ఠను ప్రజల్లో విధిగా పురిగొల్పాలని మహాత్మాగాంధీ మనకు చెప్పిన, ఆచరించి చూపిన సత్యం. అమృతోత్సవాలు జరుపుకుని శతాబ్ది పండుగకు మహోత్సాహంతో ముందుకు సాగుతోన్న భారత ప్రజాస్వామ్య మహోన్నత సంకల్పమైన మహిళా రిజర్వేషన్‌ను నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు వీగిపోవడం అధికార పార్టీ కుటిల ఎత్తుగడకు ఒక ఎదురుదెబ్బ. నిజమే, అయితే అది ప్రజలకు సంపూర్ణ విజయమా? కాదు, న్యాయసమ్మతమైన ఒక ఉపశమనం మాత్రమే. మన ప్రజాస్వామ్యంలోని అంతర్లీన సమస్యలు, అవి ప్రేరేపించే సంక్షోభాలను ఉపేక్షించకుండా సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆ ఉపశమనం మనలను జాగరూకులను చేయాలి. సరళంగా చెప్పాలంటే ఇండియన్ యూనియన్ ('ఇండియా, అంటే భారత్ రాష్ట్రాల యూనియన్' అని భారత రాజ్యాంగ మొదటి అధికరణ పేర్కొంది)కు ఒక కొత్త ఒడంబడిక అవసరమున్నది. అది రాజ్యాంగంలో ప్రతిష్ఠించిన ప్రామాణిక పాశ్చాత్య తరహా సమాఖ్య ఒడంబడిక కాకూడదు. ఎందుకని భారత సమాఖ్య, స్వతంత్ర రాష్ట్రాలు స్వచ్ఛందంగా ఏకమయ్యేందుకు కలిసివచ్చే ('కమింగ్ టుగెదర్') అమెరికా తరహా సమాఖ్యల వంటిది కాదు, దేశంలోని రాష్ట్రాలు అన్నీ 'కలిసికట్టుగా ఉండే' (హోల్డింగ్ టుగెదర్) నిర్ణయం ఫలితంగా ప్రభవించిన సమాఖ్య. అయినప్పటికీ మన రాజ్యాంగంలో అంతర్గతంగా ఒక అలిఖిత ఒడంబడిక ఉన్నది. భారత స్వాతంత్ర్యోద్యమకాలంలో జాతి జీవనంలో విస్పష్టంగా రూపుదిద్దుకున్న ఒక సైద్ధాంతిక ఏకాభిప్రాయమే ఆ అవ్యక్త ఒడంబడికకు స్ఫూర్తి, ప్రాతిపదిక. ఆ ఒడంబడికను నవీకరించుకోవల్సిన అవసరమున్నది. ఆ అలిఖిత ఒడంబడికలో మూడు సూత్రాలు ఉన్నాయి. మొదటిది, అత్యంత ముఖ్యమైనది ఆధిపత్య నిరోధం (నాన్-డామినేషన్).. ఇది కేంద్రం - రాష్ట్రాల మధ్య, రాష్ట్రాలు, రాష్ట్రాల మధ్య సంబంధాలకు వర్తిస్తుంది. ఇది ప్రాథమిక లేదా పునాది సూత్రం. రెండోది- న్యాయం (జస్టిస్). ఇది రాష్ట్రాల మధ్య, రాష్ట్రాలలోని వివిధ సామాజిక సముదాయాల మధ్య సమానత్వానికి ప్రాధాన్యమిస్తుంది. మూడోది సందర్భ నిర్దిష్టత (కాంటెక్స్ట్ స్పెసిఫిసిటి). స్థానిక ఆచారాలు, ఆచరణలు, అవసరాలను గౌరవించే విశిష్టతే ఈ నిర్దిష్టత. కొత్త ఒడంబడిక విధిగా ఈ మూడు సూత్రాలతో రూపొంది తీరాలి. డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)పై చర్చ కేవలం ఒకే ఒక్క అంశాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నది: భారత సమాఖ్య (ఇండియన్ యూనియన్)లోని రాష్ట్రాల మధ్య రాజకీయ అధికారం పంపిణీ. దేశ ఆర్థిక వనరులను పంచుకోవడం, సాంస్కృతిక అస్తిత్వాలను గౌరవించడం అనే మరో రెండు అంశాలను కూడా సమగ్రంగా చర్చించి తీరాలి. ఈ ప్రాధాన్యాల దృష్ట్యా డీలిమిటేషన్‌పై చర్చ నిష్ఫలమవలేదూ? కనుక రాజకీయ విభేదాలు మన గణతంత్ర రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయకుండా నివారించేందుకు ప్రస్తావిత మూడు అంశాలకు సరైన ప్రాధాన్యమిచ్చే ఒక సమగ్ర పరిష్కారం అవసరం ఎంతైనా ఉన్నది. నియోజకవర్గాల పునర్విభజనపై చర్చలో చిత్తశుద్ధి కొరవడింది. 'ఒక వ్యక్తి, ఒక ఓటు' అన్న ప్రజాస్వామ్య సూత్రానికి, రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఉండాలనే సమాఖ్య సూత్రానికి మధ్య వైరుధ్యం ఉన్నట్టు వెల్లడయింది. జనాభా గణన ఆధారంగా రాష్ట్రాల సీట్ల వాటాను మార్చాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పిన కేంద్ర హోం మంత్రి రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న సీట్ల నిష్పత్తిని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు! లోక్‌సభలో మొత్తం సీట్లు 50శాతం పెరగవచ్చని కూడా ఆయన సూచించారు. మంత్రివర్యుని వైఖరిలో డోలాయమానం, మాటల్లో ద్వంద్వనీతిని అటుంచితే నియోజకవర్గాల పునర్విభజన వాదన చాలా సూటిగాను, అర్థవంతంగాను ఉన్నది. 'ఒక వ్యక్తి, ఒక ఓటు,' అనే ప్రజాస్వామ్య సూత్రం ప్రకారం, ప్రతి రాష్ట్రానికి జనాభా నిష్పత్తిలో సమాన ప్రాతినిధ్యముండాలి. అయితే ప్రస్తుత పునర్విభజన సమస్యను అధిగమించేందుకు ఇది మాత్రమే న్యాయమైన పరిష్కార మార్గమా? అన్న ప్రశ్నపై నిష్పాక్షికంగా ఆలోచించవలసిన అవసరమున్నది. జనాభా పెరిగిన రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు ఇవ్వాలనేది న్యాయబద్ధమైన ప్రజాస్వామిక ఆకాంక్ష. అయితే ఇది జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా సమాఖ్య స్ఫూర్తితో జరగాలి. ఇదే అసలు సమస్య. ఈ విషయాన్ని మరింత నిశితంగా చూద్దాం. పార్లమెంటులో తమకు తక్కువ ప్రాతినిధ్యం కల్పించడం జనాభా పెరుగుదలను నియంత్రించినందుకు తమను శిక్షించడమేనని దక్షిణాది రాష్ట్రాలు నిరసిస్తున్నాయి. వాటి వాదన వాస్తవంగా బలహీనమైది. ఎందుకంటే జనాభా పెరుగుదల ప్రధాన నిర్ణాయకం ప్రభుత్వ విధానం కాదు. అంతేకాక ఒక ప్రాంత లేదా సామాజిక సమూహ జనాభా పెరుగుదల ఒక జాతీయ భారంగా పరిణమించిందనే వాదన సామాజిక న్యాయ సూత్రానికి విరుద్ధమైనది. అయితే దక్షిణాది రాష్ట్రాల ఆవేదన అర్థం చేసుకోదగిందే. ఆధిపత్య నిరోధం సూత్రం ప్రాతిపదికన నిజాయితీగా వాటికి అనుకూలంగా ఒక వాదన చేయవచ్చు. పార్లమెంటులో హిందీ భాషా రాష్ట్రాల సీట్ల సంఖ్య ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్నది. డీలిమిటేషన్‌తో ఆ సంఖ్య మరింతగా పెరిగితే దక్షిణాది లేదా జనాభా పెరుగుదలను నియంత్రించిన రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యాన్ని కోల్పోతాయి. ఇది దేశ సమైక్యత, సమగ్రతకు ఎలా దోహదం చేస్తుంది? అంతేకాక హిందీ రాష్ట్రాలకు అధిక ప్రాతినిధ్యం కల్పించడమనేది భారత సమాఖ్య అలిఖిత ఒడంబడికను పరిహసించడమే అవుతుంది. కనుక ప్రస్తుత సందర్భంలో ఒక వ్యక్తి ఒక ఓటు అనే సాధారణ ప్రజాస్వామిక సూత్రానికంటే ఆధిపత్య రాహిత్యం అనే సూత్రానికి ప్రాధాన్యమివ్వాలి. ఇది సాధ్యమే.

# జనసేన పార్టీ అధినేత ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించిన పార్టీ శ్రేణులు

**- డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యం నిమిత్తం శ్రీ సంపత్ వినాయక ఆలయంలో ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించిన పార్టీ శ్రేణులు - విశాఖ నగర అధ్యక్షులు, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాల మేరకు భారీగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ అనారోగ్యం కారణంగా జరిగిన శస్త్ర చికిత్స నుండి త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టాలని ఆకాంక్షిస్తూ జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ శ్రేణులు శ్రీ సంపత్ వినాయక ఆలయంలో హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 108 కొబ్బరికాయలు స్వామివారికి సమర్పించారు. వేకువ జామున జరిగిన హోమంలో జనసేన పార్టీ సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమ క్రతువు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వివిధ నియోజక వర్గాల సమన్వయకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నేతలు, మహిళా కోఆర్డినేటర్స్, మాజీ కార్పొరేటర్లు, వార్డ్ అధ్యక్షులు, జిల్లా నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ నీలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో పాల్గొన్న లెంక త్రినాథ్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజక వర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాలు మేరకు 35వ వార్డ్‌లో వెలంపేటలో జరిగిన శ్రీశ్రీశ్రీ నీలమ్మ అమ్మ వారి జాతర మహోత్సవంలో పాల్గొన్న జనసేన పార్టీ అధ్యక్షులు లెంక త్రినాథ్. 35వ వార్డు వెలంపేట గ్రామంలో జరిగిన శ్రీశ్రీశ్రీ నీలమ్మ అమ్మ వారి జాతర సందర్భంగా జరిగిన వేడుకల్లో వెలంపేట పెద్దలు మరియు నీలమ్మ అమ్మవారి ఆలయం కమిటీ పెద్దలు మద్ది ప్రభాకర్ మరియు రాంబాబు మరియు శంకర్ మరియు బద్రి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి 35 వార్డు జనసేన అధ్యక్షులు మరియు జనసేన పార్టీ నాయకులు మరియు పూర్ణా మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ కాపుశెట్టి శంకర్రావు, జనసేన నాయకులు బెహరా అశోక్, రామదాస్ శ్రావణ, మరియు సంధ్యా, చంద్ర మరియు కూటమి నాయకులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ 41వ వార్డ్ అధ్యక్షురాలుగా 3వ సారి ఎంపికైన కొత్తల విమల

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల రెడ్డి ఆశీస్సులతో, దక్షిణ నియో జకవర్గం ఇంచార్జి కె.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షులు అద్దాల వెంకట వర్మరాజు చేతుల మీదుగా 3వసారి 41వ వార్డ్ అధ్యక్షురాలుగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాను మీరు చెప్పిన విధముగా కాంగ్రెస్ పార్టీకి, వార్డ్ అభివృద్ధికి నాయొక్క సేవలు కొనసాగిస్తానని మీకు మాట ఇస్తున్నాను అని అన్నారు. 3 సంవత్సరాల నుండి నాకు సహాయ సహకారములు అందిస్తున్న మా నాయకులు హరసద్ బాషాకి, కస్తూరి వెంకటరావుకి, మాడుగుల. సత్యనారాయణ (30వ వార్డ్) కాకర. అప్పారావు (37వ వార్డ్) చెన్నా. అప్పారావు (35వ వార్డ్) వరహాలమ్మకి కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాను నా నియామక కార్యక్రమంలో పాల్గొని ఆశీషులు అందచేసిన గాథం మహేష్, సవరవిల్లి రామకృష్ణ, ప్రియాంక, గాయత్రి, గౌతమ్‌కి



నాయకులు అందరికి కృతజ్ఞతలు అలాగే వార్డ్ ప్రజలందరికి ఎల్లప్పుడూ అందుబాటులో వుంటానని వాగ్దానం చేస్తున్నాను అని అన్నారు.

# గ్రేటర్ 39వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా షేర్ ఆలీ నియామకం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ 39వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా షేర్ అలీ నియమితులయ్యారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి తన వంతు కృషి చేసిన షేర్ అలీ సేవలను గుర్తించి అధిష్టానం ఈ అధ్యక్ష పదవిని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి, డీసీసీ అధ్యక్షులు వెంకట వర్మరాజు, దక్షిణ నియోజకవర్గం ఇంచార్జి కె.వి.సూర్యనారాయణకి అలీ కృతజ్ఞతలు తెలిపారు. 39వ వార్డ్‌లో ఉన్న ప్రజలతో మమేకమై, స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కారం చేయటానికి, అలాగే పార్టీని బలో



పేతం చేయటానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# నకులరాజు సేవలు మరువలేనివి


**- క్రమశిక్షణతో కూడిన విద్య, విద్యార్థుల పట్ల అంకితభావం, సమాజ సేవ, ఉన్నత విలువలు నకులరోజు మాస్టారు సొంతం - ఘనంగా నకులరాజు పదవీ విరమణ సత్కారం**



**అల్లవరం, (రాజధాని వార్తలు):** విద్య పట్ల అంకితభావం, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ,సమాజ సేవకు తన వంతు కృషి, ఉన్నత విలువలు ఆ ఉపాధ్యాయుని సొంతం. ఏ పాఠశాలలో పనిచేసినా అందరితో మమేకమై వివాద రహితుడిగా, స్నేహశీలిగా అందరికంటే మన్ననలు పొందిన నకుల రాజు మాస్టారు పదవి విరమణ సత్కారంలో ఆయన సేవలను వేనోళ్ళ పొగిడిన మధుర క్షణాలవి. అల్లవరం మండలం తూర్పులంక జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బత్తుల నకుల రాజు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయభాను మల్లప రాజు అధ్యక్షతన నక్కల రాజు మాస్టర్ పదవీ విరమణ సత్కారం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పిటిసి కొనుకు గౌతమి మహేష్, ఎంఈఓలు కే కిరణ్ కిరణ్ బాబు, సానబోయిన ఏడుకొండలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వక్తలు మాట్లాడుతూ బత్తుల నకులరాజు మాస్టారు పాఠశాలలో చేసిన సేవలను, అభివృద్ధిని కొనియాడారు. అంతేకాకుండా ఆయన సమాజానికి, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఏఐజి మోకా సత్తిబాబు ఐపీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా చేసిన సేవలు, వ్యక్తిగతంగా ఆయన సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. నకులరాజు మాస్టారును దుస్సాలువాలు పూమాలలతో ఘనంగా సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా నకులరాజు మాస్టారు మాట్లాడుతూ ఎస్జిటిగా పాఠశాలలో చేరిన స్కూల్ అసిస్టెంట్‌గా నేను పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థులతో ఉన్న అనుబంధం మరువలేనిదని నేను టీచర్ వృత్తిని ఎన్నుకోవటం పూర్వజన్మ సుకృతమని ఈ ప్రయాణంలో నాకు సహకరించిన విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, విద్యార్థులు తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. తన పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ నకుల్ రాజు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచించిన "బుద్ధుడు-బౌద్ధ దమ్మము" అనే పుస్తకాన్ని బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడలి గంగాజలం, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు, యలమంచిలి సింహాద్రి ప్రసాద్, జల్లి దొరబాబు, బండారు వెంకటేశ్వరరావు, స్కూల్ ఎస్ఎంసి చైర్పర్సన్ జల్లి దుర్గ, వైస్ చైర్పర్సన్ కడలి మహాలక్ష్మి, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

# జెడ్ బావారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పంతం

**- కరప మండలంలో 16 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు**



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలం జడ్. బావారం రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. కరప మండల వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎమ్మెల్యే పంతం నానాజీ తొలి ట్రాక్టర్ లోడుకు జెండా ఊపి కొనుగోలు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 16 రైతు సేవా కేంద్రాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతు ఖాతాలో ధాన్యం సొమ్ము జమ చేసామని, ప్రతి ఎకరాకు సాగునీరు అందించామని, రైతుని ఉన్నత స్థితిలో చూడాలి అనే తాపత్రయంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. రైతు సేవాకాంద్రాల్లో దాన్యం కొనుగోలు చేసినప్పుడు తేమ శాతం ఎంత ఉందో రైస్ మిల్లు వద్ద అదే కొలమానంతోనే రైస్ మిల్లర్లు కొనుగోలు చేయాలి. రైతులను ఇబ్బంది పెట్టితే కఠిన చర్యలు తప్పవు అని తెలిపారు. పంట నమోదు పూర్తి చేసిన ప్రతి రైతు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరగా 75 కేజీల బస్తాకు రూ. 1777 చెల్లించడంతో పాటు గోనె సంచులు, కూలీల ఖర్చులు, రవాణా ఖర్చుల కోసం అదనపు సాయం అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, ఆత్మ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్, బీజేపీ నాయ కులు రంబాల వెంకటేశ్వరరావు, పితాని లీలావతి, జనసేన మండల అధ్యక్షులు బండారు మురళి, సీనియర్ నాయకులు భోగిరెడ్డి కొండబాబు, యాళ్ల పండు, సొసైటీ అధ్యక్షులు గంటా వీరన్న చౌదరి, వెలుగుబంట్ల సూర్యనారాయణమూర్తి, సైనవరపు భవాని శంకర్, దూడల నారాయుడు, నీటి సంఘం అధ్యక్షులు జోకా తాతాజీ, మెండు గోవిందు, రెడ్డి లోవరాజు, గోన అంజి, అనుకుల రాంబాబు, నక్క అంజి, చోడబత్తుల మణికంఠ, శ్రీనివాస్, నక్క బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

# 52 ఏళ్ల వయసులోనూ ఇలా మెరిసిపోవడానికి కారణం, ఆమని చెప్పిన లైఫ్ సీక్రెట్!



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన సీనియర్ నటి ఆమని 52 ఏళ్ల వయసులోనూ ఫిట్‌గా, ఉత్సాహంగా కనిపించడం వెనకున్న రహస్యం ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం కోసం చూస్తే.. అది కేవలం యోగా, డైట్ మాత్రమే కాదు. ఆమె జీవితాన్ని నడిపిస్తున్న ఆధ్యాత్మిక క్రమశిక్షణ కూడా కీలక పాత్ర పోషిస్తోందనే విషయం స్పష్టమవుతోంది. ముఖ్యంగా సహస్రనామ పారాయణమే తన ఎనర్జీకి మూలం అని ఆమె చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఫిట్‌నెస్ సీక్రెట్ యాంగిల్ నుంచి చూసినా, డిసిప్లిన్ & లైఫ్‌స్టైల్ కోణం నుంచి విశ్లేషించినా ఆమె రోజువారీ దినచర్యలో ఆధ్యాత్మికతే కేంద్రబిందువుగా కనిపిస్తుంది. ప్రతి రోజూ తెల్లవారు జామునే లేవడం ఆమెకు అలవాటు. ఉదయం 4 గంటలకే నిద్రలేచి స్నానం చేసి పూజకు సిద్ధమవడం, ఆ తర్వాత లలితా సహస్రనామం లేదా విష్ణు సహస్రనామం పారాయణం చేయడం ఆమె దినచర్యలో తప్పనిసరి భాగం. టైమ్ లేకపోతే కనీసం అష్టోత్తరం అయినా చదవకుండా బయటకు వెళ్లనని చెప్పడం ఆమె భక్తిని ప్రతిబింబిస్తుంది. ఇదే ఆధ్యాత్మిక క్రమశిక్షణ ఆమెకు మానసిక ప్రశాంతతను అందిస్తోందని, ఆ ప్రశాంతతే శారీరక ఆరోగ్యంగా మారుతుందని, పూజ చేయని రోజు ఏదో కోల్పోయినట్లు అనిపిస్తుందన్న ఆమె మాటలు ఆధ్యాత్మికత ఆమె జీవితంలో ఎంత ప్రధానమో తెలియజేస్తున్నాయి. ఇక ఫిట్‌నెస్ యాంగిల్‌లో చూసుకుంటే పూజ తర్వాత ఆమె చేసే యోగా కూడా కీలక అంశం. శరీరానికి వ్యాయామం ఎంతో అవసరమని ఆమె నమ్ముతారు. అయితే ఇది కేవలం ఫిజికల్ ఫిట్‌నెస్‌కే పరిమితం కాదు, ఆధ్యాత్మికతతో కూడిన జీవనశైలి వల్లే ఆమెకు పూర్తి ఆరోగ్య సమతుల్యత లభిస్తోందని చెప్పాలి. డిసిప్లిన్, లైఫ్‌స్టైల్ పరంగా చూసుకుంటే ఆమె జీవితం ఒక పాఠంలా నిలుస్తుంది. టైమ్‌కి నిద్రపోవడం, ఉదయం త్వరగా లేవడం, రోజును క్రమపద్ధతిలో గడపడం.. ఇవే ఆమె అందం, ఆరోగ్యానికి అసలు కారణాలుగా కనిపిస్తున్నాయి. డైట్, ఆహారపు అలవాట్ల పరంగా కూడా ఆమె ప్రత్యేకత స్పష్టంగా కనిపిస్తుంది. తాను అన్ని రకాల ఆహారాలను ఎంతో అద్భుతంగా వండినప్పటికీ, చాలా మితంగా తింటానని చెప్పం, ఆమె కట్టుదిట్టమైన ఆహార నియమాలను తెలియజేస్తున్నాయి.

గ్లామర్ ఇండస్ట్రీలో ఉన్నప్పటికీ పార్టీలకు, పబ్స్‌కు దూరంగా ఉండటం, కుటుంబానికి ప్రాధాన్యత ఇవ్వడం ఆమె వ్యక్తిత్వాన్ని మరింత ప్రత్యేకంగా నిలబె డుతుంది. ఆమె మొత్తం జీవనశైలిని గమనిస్తే మధ్యవయసు మహిళలకు ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, కుటుంబ బాధ్య తల మధ్య సమతుల్యత ఎలా సాధించాలో ఆమె చూపిస్తున్న మార్గం ప్రేరణగా మారుతోంది.

# డెడికేషన్ అంటే ఇదే! ప్రెగ్నెన్సీలోనూ యాక్షన్ సీన్స్‌లో దీపిక!







అల్లు అర్జున్ హీరోగా, డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం రాకా చుట్టూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె రెండోసారి తల్లి కాబోతున్నట్లు అనౌన్స్ చేసిన తర్వాత, ఈ సినిమాకు సంబంధించి పలు వదంతులు వైరల్ అయ్యాయి. ఆమె పాత్రను తగ్గిస్తున్నారనే ప్రచారం, షూటింగ్ ఆలస్యమవుతుందనే ఊహాగానాలు వేగంగా వ్యాపించాయి. అయితే ఈ రూమర్స్‌పై చిత్రబృందం క్లారిటీగా స్పందిస్తూ, సినిమాలో ఎలాంటి మార్పులు లేవని, ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారమే షూటింగ్ కొనసాగుతోందని ప్రకటించింది. దీంతో ఈ రూమర్లకు తాత్కాలిక ముగింపు లభించినప్పటికీ, సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ప్రభావం ఎంత వేగంగా పెరుగుతుందో మరోసారి స్పష్టమైంది. రాకా సినిమా కథలో దీపిక పాత్ర ప్రాధాన్యత విషయానికి వస్తే, ఆమె పాత్రను కుదించలేదని, అదే స్థాయిలో కొనసాగుతోందని మేకర్స్ క్లారిటీ ఇవ్వడం గమనార్హం. భారీ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో ఆమె పాత్ర కథను ముందుకు నడిపే కీలక భాగంగా ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో హీరోయిన్ పాత్రలకు పెరుగుతున్న ప్రాధాన్యత నేపథ్యంలో, ఈ నిర్ణయం ఒక ట్రెండ్‌ను ప్రతిబింబిస్తోంది. యాక్షన్ మరియు కథా బలం కలిసిన పాత్రలతో హీరోయిన్ల పాత్రలు కూడా సమాన స్థాయిలో నిలబడుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ మొత్తం పరిణామంలో అత్యంత చర్చనీయాంశంగా మారింది.

# శ్రీలీల మళ్లీ లేచే అవకాశం ఉందా...?



కన్నడంలో చిన్నా చితకా సినిమాలు చేస్తూ కెరీర్‌ను ప్రారంభించిన శ్రీలీలకు అనుకోని అవకాశం అన్నట్లుగా రాఘవేంద్రరావు ‘పెళ్లి సందడి’ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఏరి కోరి మరీ రాఘవేంద్రరావు శ్రీలీలను ఎంపిక చేశాడని, ఆ సినిమాలో శ్రీలీలను ప్రత్యేకంగా, మరింత అందంగా కనిపించేందుకు గాను రాఘవేంద్రరావు కొన్ని సీన్స్ సైతం దర్శకత్వం వహించాడు అంటారు. ఆ విషయం పక్కన పెడితే పెళ్లి సందడి సినిమా నిరాశను మిగిల్చింది. అయినా కూడా శ్రీలీలకు మాత్రం దర్శకేంద్రుడు మెచ్చిన హీరోయిన్ అంటూ పేరు దక్కింది. దాంతో వార్తల్లో నిలిచింది. టాలీవుడ్‌లో మొదటి సినిమా ఫ్లాప్ అయితే ఆఫర్లు పెద్దగా రావు. కానీ శ్రీలీలకు మాత్రం మంచి ఆఫర్లు వచ్చాయి. రవితేజకు జోడీగా నటించిన ‘ధమాకా’ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో శ్రీలీల టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గా శ్రీలీల ధమాకాతో సూపర్ హిట్ కొట్టడంతో ఏకంగా అరడజను సినిమా ఆఫర్లు ఆమె చేతిలో పడ్డాయి. ఆ సినిమాల్లో కొన్ని ఫ్లాప్ అయితే కొన్ని పర్వాలేదు అన్నట్లుగా నిలిచాయి. గత మూడు నాలుగు ఏళ్లుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీ బిజీగా ఉంది. పుష్ప 2 లో చేసిన కిస్సిక్ డాన్స్‌తో బాలీవుడ్ ప్రేక్షకులు, తమిళ్ ప్రేక్షకులు సైతం ఈమె వైపు చూశారు. అందుకే తమిళ్, హిందీ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కాయి. ఇప్పటికే తమిళ్‌లో ఈమె పరాశక్తి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. బాలీవుడ్‌లో అనురాగ్ బసు దర్శకత్వంలో ఒక సినిమాను చేస్తోంది. తమిళ్‌లో చేసిన పరాశక్తి ఫ్లాప్ కాగా, హిందీలో ఎంట్రీ ఇవ్వాల్సిన అనురాగ్ బసు మూవీ ఆలస్యం అవుతూ వస్తోంది. హిందీలో ఈమె ఎంట్రీ ఉంటుందా అనే అనుమానాలు సైతం కొందరు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో శ్రీలీల కెరీర్ పై ఆందోళన మొదలైంది. గత సంవత్సరం రాబిన్‌హుడ్, జూనియర్, మాస్ జాతర సినిమాలతో శ్రీలీల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మూడు సినిమాల్లో ఏ ఒక్కటి కమర్షియల్‌గా బిగ్ సక్సెస్‌ను దక్కించుకోలేదు. ఇక ఈ ఏడాది ఇప్పటికే పరాశక్తి, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలతో వచ్చింది. శివకార్తికేయన్ హీరోగా వచ్చిన పరాశక్తి తమిళ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. దాంతో శ్రీలీలను అక్కడ కనీసం పట్టించుకోలేదు. ఇక తెలుగులో పవన్ హీరోగా వచ్చిన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకు పర్వాలేదు అన్నట్లుగా టాక్ వచ్చినా.... సినిమాలోని ఆమె పాత్ర విషయంలో పెద్దగా మార్కులు పడలేదు. పవన్ ముందు ఆమె కనిపించలేదు. అందుకే ఆ సినిమా శ్రీలీలకు పెద్దగా మైలేజ్ తెచ్చి పెట్టలేదు అనేది వాస్తవం. అందుకే శ్రీలీల ఇప్పుడు ఆఫర్ల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది అంటూ సినీ విశ్లేషకులు, మీడియా వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శ్రీలీల కెరీర్ ఆరంభం నుంచి కూడా కానిస్టెంట్‌గా సక్సెస్‌లను దక్కించుకోలేకపోయింది.

# గుండెపోటుతో 30 ఏళ్ల హర్యానా నటి మృతి



విన్నంతనే అయ్యో అనిపించే విషాద ఉదంతం ఒకటి చిత్రపరిశ్రమలో చోటు చేసుకుంది. గుండెపోటుతో హర్యానాకు చెందిన 30 ఏళ్ల దివ్యాంక శిరోహి మరణించారు. మంగళవారం రాత్రి అనూహ్యంగా చోటు చేసుకున్న ఈ ఉదంతం చిత్రపరిశ్రమకు షాకింగ్ గా మారింది. రాత్రి ఎనిమిది గంటల వేళలో ఇంట్లో కింద పడిపోయినట్లుగా దివ్యాంకను గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లుగా వైద్యులు వెల్లడించారు. ఆమె అంత్యక్రియలు ఘజియాబాద్ లో జరిగాయి. చిన్న వయసులోనే గుండెపోటుతో మరణించిన దివ్యాంక ఉదంతం ఆమె అభిమానులను.. చిత్రపరిశ్రమలోని వారిని తీవ్ర విసాదానికి గురి చేసింది. ఆమె మరణంపై కుటుంబ సభ్యులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. దివ్యాంక స్వస్థలం ఉత్తరప్రదేశ్ కాగా.. ఆమె సోదరుడు హిమాంశు.. సోదరీమణులు దీపాంశు.. జస్మీత్‌తో కలిసి ఉంటున్నారు. ఫ్యామిలీ పర్సన్‌గా ఆమెను చెబుతుంటారు. తల్లిదండ్రులు కూడా వీరితో కలిసి ఉంటారని చెబుతున్నారు. తండ్రి వ్యాపారి కాగా.. తల్లి గృహిణి. 1996 నవంబరు 19న పుట్టిన ఆమె.. మీరట్‌లోని చౌదరి చరణ్ సింగ్ వర్సిటీలో బీసీఏ.. సిక్కింలో ఎంబీఏను పూర్తి చేశారు. యాభైకు పైగా హర్యానా పాటల్లో నటించటమే కాదు.. హర్యానాకు చెందిన అగ్రశ్రేణి గాయకులు మాసూమ్ శర్మ.. అమిత్ సైని రోహ్‌తకియా.. కేడీలాంటి ప్రముఖులతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఇటీవల కాలంలో సినిమాల్లో అవకాశాలు లభిస్తున్నాయి. టిక్ టాక్ ఉన్న కాలంలో ఆమె చేసిన ఒక వీడియో ఆమెను రాత్రికి రాత్రి స్టార్‌ను చేసింది. సదరు వీడియో ఏకంగా 20 మిలియన్ల వ్యూస్‌ను సాధించింది. ‘మేరీ మమ్మీ’ అనే వీడియో ఆమె కోట్లాది మందికి సుపరిచితురాలిగా మారింది. ఆమె తుదిశ్వాస విడిచిన రాత్రి వేళ..తన సోదరుడికి వంట చేసినట్లుగా చెబుతున్నారు. అంకాదు.. సోదరుడు ఇంట్లో నుంచి బయటకు వెళుతూ.. తాను బయటకు వెళుతున్నట్లుగా పేర్కొంటూ.. గేటు వేసుకోవాలని కోరుతూ మెసేజ్ పెట్టగా.. అందుకు ఆమె ఓకే అంటూ రిప్లై ఇచ్చింది.అదే ఆమె చివరి మెసేజ్‌గా చెబుతున్నారు. సాయంత్రం నుంచి తన ఆరోగ్యం సరిగా లేదని.. నీరసంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పారు. నడుస్తూ తూలి కింద పడిపోవటం..తలకు పెద్ద గాయం తగలటం.. ఆమె పడిన శబ్దానికి ఇంట్లోని వారు చూసి హుటాహుటిన ఆసుపత్రికి తరలించినట్లుగా చెబుతున్నారు ఆమె ఆకస్మిక మరణం గురించి తెలిసిన వారంతా షాక్ తింటున్నారు. ఆమె చివరగా మార్చి 19న ఒక వీడియోను ఇన్‌స్టాలో షేర్ చేశారు. అందులో బ్లూ ఫ్లోరల్ డ్రెస్‌లో బి ప్రాక్–అఫ్సానా ఖాన్ పాడిన పాటకు డాన్స్ చేస్తున్న వీడియోను అప్ లోడ్ చేశారు. ఆ వీడియోకు రాధే రాధే అన్న క్యాప్షన్ ఇచ్చారు. ఆమె మరణం సందర్భంగా మరో విషయాన్ని ఆమె అభిమానులు షేర్ చేస్తున్నారు. ఇటీవల ఆమె తన ఇన్‌స్టాలో ఒక ఫోటోను పిన్ చేశారు. అందులో నీలిరంగు జాకెట్.. మెరూన్ కలర్ తలపాగా ధరించి.. ఆ ఫోటోకు ‘శివా.. నన్ను నీతో తీసుకెళ్లు’ అన్న క్యాప్షన్ ఇవ్వటం గమనార్హం.

# టిడిపి నాయకుడు మల్లేశ్వరరావుపై కత్తితో దాడి



మక్కువ, (రాజధాని వార్తలు): స్థానిక ప్రధాన రహదారి విస్తరణ పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకుడు, ప్రైవేటు వైద్యాధికారి మల్లేశ్వరరావుపై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన మండల కేంద్రం మక్కువలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం మక్కువకు చెందిన డాక్టర్ పి. మల్లేశ్వరరావు రోడ్డు విస్తరణ కార్యక్రమాలు పర్యవేక్షిస్తుండగా, మక్కువ బిసి కాలనీకి చెందిన గొర్లి నారాయణరావు అనే వ్యక్తి నా యొక్క పండ్ల షాపును తొలగిస్తారా అంటూ, అక్కడే ఉన్న కొబ్బరికాయలు చెక్కే కత్తితో విచక్షణరహితంగా డాక్టర్ మల్లేశ్వరరావుపై దాడి చేశాడు. ఈ విషయంపై మల్లేశ్వరరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట రమణ తెలిపారు.

# రామానుజాచార్యులకు పంచామృత అభిషేకాలు

విజయనగరం, (రాజధాని వార్తలు): భగవద్ రామానుజాచార్యుల తిరునక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రామానుజాచార్యులకు పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు .నూట ఇరవయ్యేళ్ళ పరిపూర్ణ జీవనం గడిపిన రామానుజులు వైష్ణవాన్ని కుల, లింగ భేదాలు లేని ధర్మంగా తీర్చిదిద్దారు. దేశమంతటా పర్యటనలు చేశారు. వైష్ణవ సంప్రదాయాన్ని, విశిష్టాద్వైతాన్ని విశేషంగా ప్రచారం చేశారు. శిథిలమైన ఎన్నో దేవాలయాలను పునరుద్ధరించారు. భగవద్ రామానుజాచార్యుల తిరునక్షత్రాన్ని పురస్కరించుకొని దేవాలయం అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, లక్ష్మీనరసింహచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ



రామానుజాచార్యులకు పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు భక్తులు పాల్గొన్నారు.

# జాతీయ బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడిగా పెంట తిరుపతిరావు



మక్కువ, (రాజధాని వార్తలు): జాతీయ బీసీ సంక్షేమ సంఘ సాలూరు నియోజకవర్గ అధ్యక్షులుగా మండలంలోని ఏ. వెంకంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెంట తిరుపతిరావు ఎన్నికయ్యారు. హైదరాబాద్ బీసీ సంక్షేమ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సమక్షంలో సంబంధిత ఎన్నిక ధ్రువపత్రాన్ని పెంట తిరుపతి రావుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పెంట. తిరుపతిరావు మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలోని బీసీల సంక్షేమమే ధ్యేయంగా పూర్తిస్థాయిలో కృషి చేస్తానని, బీసీ సంఘ అభివృద్ధి కొరకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, మహిళ అధ్యక్షురాలు వై.నూకాలమ్మ, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు రేవళ్ల. తిరుపతిరావు, బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి పి ల్ల. కన్నం నాయుడు పాల్గొన్నారు.

# నిషేధిత రసాయనాలతో పండ్లను పండిస్తే కఠిన చర్యలు

### - జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు హెచ్చరిక



నెల్లూరు, (రాజధాని వార్తలు):ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా నిషేధిత రసాయనాలతో పండ్లను కృత్రిమంగా పండించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో నగరంలోని పండ్ల వ్యాపారులు, సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అవగాహన సమావేశం నిర్వహించారు. తొలుత అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మామిడి, అరటి పండ్లను ఏ విధంగా కృత్రిమ పద్ధతుల్లో మగ్గబెట్టాలి, ఎలాంటి పద్ధతుల్లో మగ్గబెట్టకూడదో వివరించారు. జిల్లాలో కార్బయిడ్‌ను వ్యాపారులు ఎవరు కూడా వినియోగించకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. పండ్ల కృత్రిమ మగ్గింపునకు ఎతిలిన్ గ్యాస్ ఛాంబర్లు, ఎథిలిన్ సాచెట్లను ప్రభుత్వం నిబంధనలు మేరకు వినియోగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జైలు శిక్షతోపాటు 10 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కాల్షియం కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాల వినియోగం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. పండ్లను సహజంగా లేదా నియంత్రిత ఎథిలిన్ గ్యాస్ పద్ధతిలో మాత్రమే పండించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండ్ల వ్యాపారులు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించి వినియోగదారులకు సురక్షితమైన పండ్లు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. గోదాములు, నిల్వ కేంద్రాల్లో శుభ్రత, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమ చర్యలను అరికట్టాలని ఆదేశించారు. ప్రజలు అసహజంగా మెరుస్తున్న లేదా త్వరగా పండినట్లు కనిపించే పండ్లపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులను వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం, ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పండ్ల కృత్రిమ మగ్గింపు పై పండ్ల వ్యాపారులకు ఉద్యానవన శాస్త్రవేత్తలతో ఒక అవగాహన సదస్సు నిర్వహించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, తూనికల కొలతల శాఖ అధికారి ఐజాక్, మార్కెటింగ్ శాఖ ఏడి అనిత, ఫుడ్ సేఫ్టీ అధికారులు, పండ్ల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# గాలి, వర్షానికి మేకలశాల కూలి సిహెచ్‌డబ్ల్యు మృతి

మక్కువ, (రాజధాని వార్తలు): గాలి, వర్షానికి మేకలశాల కూలి ఓ మహిళ మృతి చెందిన ఘటన మక్కువ మండలం దబ్బగెడ్డ పంచాయతీ నగుళ్లదబ్బగెడ్డ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ముప్వల రేవతి (30) అనే మహిళ మంగళవారం మేకలు శాల తుడుస్తుండగా, అకస్మాత్తుగా గాలి వర్షం రావడంతో శాల మొత్తం పడిపోయింది. రేవతి శాలలో ఇరుక్కుపోవడంతో, ఆమెపై మేకల శాల పడిపోవడంతో గాయాలపాయింది. గ్రామస్థులు వెంటనే రేవతిని సాలూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. రేవతి శంబర పీహెచ్‌సిలో కమ్యూనిటీ హెల్త్‌వర్కర్‌గా పనిచేస్తుంది.

# బంగారు కుటుంబాల దత్తత త్వరగా పూర్తి కావాలి

### - అన్ని చెరువులను తనిఖీ చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





విజయనగరం, (రాజధాని వార్తలు): జిల్లాలో బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశాన్ని, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పి-4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాల దత్తత, నిధుల రీఎంబర్స్‌మెంట్, జలధార ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 82,426 బంగారు కుటుంబాలను గుర్తించగా, వీరిలో ఇప్పటి వరకు 3,941 మంది మార్గదర్శుల ద్వారా 20,157 కుటుంబాల దత్తత పూర్తి అయ్యిందని చెప్పారు. మిగిలిన కుటుంబాల దత్తను త్వరగా పూర్తి చేయాలని కోరారు. వివిధ శాఖలకు ఎస్‌డిపి, ఎంపి ల్యాడ్స్ నుంచి సర్దుబాటు క్రింద అందజేసిన నిధులను ఆయా శాఖలు వెంటనే తిరిగి చెల్లించాలని ఆదేశించారు. జలధార కార్యక్రమంపై సమీక్షిస్తూ, జిల్లాలోని అన్ని మైనర్ ఇరిగేషన్ చెరువులను తనిఖీ చేసి, పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ఎంపిడిఓలకు సూచించారు. జిల్లావ్యాప్తంగా 8015 చెరువులు ఉండగా, ఇప్పటివరకు 4,276 చెరువుల తనిఖీ మాత్రమే జరిగిందని, వెంటనే ఈ ప్రక్రియ పూర్తి కావాలని చెప్పారు.

ఉపాధి హామీ పథకం క్రింద ఇప్పటివరకు 11,818 పనులకు ఆమోదం తెలపగా, జలధార కార్యక్రమం కోసం ఇప్పటివరకు 8,655 పనులను మాత్రమే గుర్తించారని, ఈ తేడాను వెంటనే సరిచేయాలని ఆదేశించారు. అలాగే ఇప్పటివరకు సుమారు 3,994 పనులు ప్రగతిలో ఉన్నాయని, వీటన్నిని వెంటనే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. గ్రామం వారీగా భూగర్భ జలాల మట్టాన్ని నమోదు చేయాలని, జలధార పనులు మొదలు పెట్టకముందు, పనులు నిర్వహించిన తరువాత, వర్షాలు పడి నీరు నిండిన తరువాత తప్పనిసరిగా ఫోటోలను తీసి అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ పి. బాలాజీ, డ్వామా పిడి శారదాదేవి, ఇరిగేషన్ ఈఈ వెంకటరమణ, ఇతర అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిఎల్‌డిఓలు, ఎంపిడిఓలు, ఇరిగేషన్ ఏఈలు, ఏపిఓలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయి విద్యాబోధన రాష్ట్రానికే ఆదర్శం

### - విఆర్ఎం స్కూల్ 'గ్రాడ్యుయేషన్ డే'లో పట్టాలు అందజేసిన కమిషనర్ నందన్





నెల్లూరు, (రాజధాని వార్తలు): రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దూరదృష్టికి సజీవ సాక్ష్యం నెల్లూరులోని వి.ఆర్.మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను ఉచితంగా అందించాలన్న ఆయన సంకల్పం నేడు వందలాది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. కార్పొరేట్ స్కూళ్లకు సైతం సవాల్ విసిరేలా ఈ ప్రభుత్వ బడిలోని 180 మంది చిన్నారులు కార్పొరేషన్ కమిష నర్ నుంచి పట్టాలు అందుకోవడం నెల్లూరు విద్యా చరిత్రలోనే ఒక మైలురాయి. మంత్రి నారాయణ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దిన విఆర్ మున్సిపల్ హై స్కూల్ మొదటి అకడమిక్ ఏడాదిలోనే ఊహించని విజయాలను నమోదు చేసుకున్న సందర్భంగా ఆ పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే జరిగింది. ముఖ్య అతిథిగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నందన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పేదవాడిగా పుట్టడం మన తప్పు కాదనీ, కానీ పేదవాడిగా చనిపో కూడదనే మంత్రి నారాయణ ఆలోచన నుంచి కార్యరూపం దాల్చినదే విఆర్ మునిసిపల్ హైస్కూల్ అని అన్నారు. మంత్రి నారాయణ చొరవతో ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సౌకర్యం, పౌష్టికాహారం, కార్పొరేట్ టీచర్ల బోధన వల్ల 1065 మంది విద్యార్థులు ఇక్కడ అద్భుతంగా రాణిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 180 మంది విద్యార్థులకు ప్రీ-గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు,మెడల్స్ పంపిణీ చేశామన్నారు. పట్టాలు అందుకున్న ప్రతి విద్యార్థి వెనుక మంత్రి కృషి, నిరంతర పర్యవేక్షణ దాగి ఉందన్న విషయాన్ని కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**నాడు భిక్షాటన-నేడు ఇంగ్లీష్‌లో అనర్గళంగా..**

ఒకప్పుడు భిక్షాటన చేస్తూ గడిపిన ఓ బాలుడు వెంకటేశ్వర్లు, నేడు విఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో చేరి ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడుతుండటం ఒక గొప్ప మార్పు అని కమిషనర్ నందన్ అన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ స్వయంగా ఆ బాలుడికి అడ్మిషన్ ఇచ్చి చదువు పట్ల ఆసక్తి కలిగించారన్నారు నేడు ఆ విద్యార్థి మూడో తరగతికి ప్రమోట్ అవ్వడం గర్వకారణమని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి వసతులు, నిష్ణాతులైన టీచర్లు, ఉచిత రవాణా సౌకర్యాలతో నెల్లూరులోని వీఆర్ మునిసిపల్ కార్పొరేషన్ హై స్కూల్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందని కమిషనర్ నందన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చింతాల వెంకటరావు, అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటరమణ, అసిస్టెంట్ హెడ్ మాస్టర్ లక్ష్మీనారాయణ, మరియు టీచర్లు గురుప్రసాద్, జయలక్ష్మి, హరిత, చంద్రకళ, ఎంఈఓ హమీద్ పాఠశాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు): తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తమటం వెంకట నరసింహులు, తలపా దామోదరం రెడ్డి, శ్రీనివా సులు రెడ్డి, గండవరపు రమేష్ రెడ్డి, ఇంగిలలా భాస్కర్, తుమ్మ దేవదానం, శివశంకర్, కరీముల్లా, చిరంజీవి, శివ బాలాజీ, ఫయాజ్,మణి, శ్రీను గౌడ్, ఇళయరాజా,పూల చంద్ర శేఖర్,సునీల్ రెడ్డి, భాస్కర్, మురళి, కృష్ణమూర్తి, షణ్ముగం, తిరుమలై, ఆల్విన్, రఘు, అంబేద్కర్, బాబు, శబరిరాజన్, బాలరాజు, శివప్రసాద్, రాజిక్, మాస్, నాగరాజు, జోసెఫ్, గీతా తదితరులు పాల్గొన్నారు.



# "పార్కుల్లో నడకపై పన్ను" - అసత్య ప్రచారం

**- తప్పుడు, తప్పుదారి పట్టించే ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు, వాకర్లకు విజ్ఞప్తి - పార్కుల్లో నడకకు జీవీఎంసీ ఎలాంటి రుసుములు వసూలు చేయడం లేదు - స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, శివాజీ పార్క్‌లలో మాత్రమే నిర్వహణ కొరకు స్వల్ప వినియోగ రుసుములు**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పార్కుల్లో నడకపై పన్ను విధించారన్న ప్రచారం పూర్తిగా అసత్యమని గ్రేటర్ విశాఖ పట్నం మునిసిపల్ కార్పొరేషన్ జీవీఎంసీ స్పష్టం చేసింది. నగరంలో ప్రజల ఆరోగ్యం, వినోదాన్ని దృష్టిలో ఉంచుకుని గత రెండేళ్లలో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో సుమారు 45 పార్కులను అభివృద్ధి చేసినట్లు తెలియజేసింది. అలాగే మరో రూ.30 కోట్ల వ్యయంతో పలు క్రీడా మైదానాలు, స్టేడియాలను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది. ప్రస్తుతం నగరంలోని ఏ పార్కులోనూ వాకర్ల నుండి ఎలాంటి రుసుములు లేదా పన్నులు వసూలు చేయడం లేదని, కేవలం శివాజీ పార్క్‌లో మాత్రమే గత 25 సంవత్సరాలుగా ఎలాంటి పెంపు లేకుండా రూ.75/- నెలకు స్వల్ప రుసుము వసూలు చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన సుమారు 180 పార్కులను జీవీఎంసీ ప్రత్యక్షంగా లేదా నివాసితుల సంక్షేమ సంఘాలతో కలిసి నిర్వహిస్తోందని, ఎక్కడా వాకింగ్ ఫీజు విధిం చలేదని స్పష్టం చేశారు. ఇటీవల స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంను రూ.18 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసి, ఎటువంటి ప్రైవేట్ సంస్థలకు అప్పగించకుండా జీవీఎంసీ స్వయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాకర్లకు తాగునీటి సదుపాయాలతో కూడిన శుభ్రమైన నడక ట్రాక్ ఏర్పాటు చేయబడినట్లు పేర్కొన్నారు. నిర్వహణ ఖర్చుల నిమిత్తం రోజుకు రూ.2 (నెలకు రూ.60 / సంవత్సరానికి రూ.720) మాత్రమే స్వల్ప వినియోగ రుసుము వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ స్వల్ప రుసుము చెల్లిస్తూ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం మరియు శివాజీ పార్క్‌లలో పెద్ద సంఖ్యలో వాకర్లు సౌకర్యాలను వినియోగిస్తున్నారని, ఇప్పటివరకు ఎలాంటి అభ్యంతరాలు లేవని కమిషనర్ తెలిపారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని, అలాంటి అసత్యాలను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. గాజువాకలో రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మరియు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంను రూ.10 కోట్ల చొప్పున అభివృద్ధి చేసి, వాటి నిర్వహణకు ప్రతి నెలా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. శివాజీ పార్క్‌లో గత 25 సంవత్సరాలుగా నెలకు రూ.75 (రెండు నెలలకు రూ.150) రుసుము వసూలు చేస్తున్నట్లు కూడా పేర్కొన్నారు. అలాగే విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో పోర్ట్ అధికారులు నెలకు రూ.100 (సంవత్సరానికి రూ.1200) వసూలు చేస్తున్నారని, దీనితో పోలిస్తే జీవీఎంసీ కొన్ని సౌకర్యాలలో మాత్రమే రోజుకు రూ.2 అనే స్వల్ప రుసుము మాత్రమే వసూలు చేస్తున్నట్లు తెలిపారు. "పార్కుల్లో నడకపై పన్ను" అనే తప్పుడు ప్రచారాలను ప్రజలు తిరస్కరించి, నగర అభివృద్ధి మరియు నిర్వహణలో సహకరించాలని కమిషనర్ ప్రజలకు, వాకర్లకు విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్ వ్యతిరేకంపై అవగాహన





**నెల్లూరు /పొదలకూరు, (రాజధాని వార్తలు):** మాదక ద్రవ్య నిర్మూలనకు అవగాహన కల్పించే దిశగా ఈనెల 6వ తేదీన తిరుపతి నుంచి ప్రారంభమైన సైకిల్ యాత్ర 13 జిల్లాల మీదుగా 17 రోజుల పాటు సాగి బుధవారం విశాఖపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా వైబ్రంట్స్ ఆఫ్ కలాం ఆధ్వర్యంలో పొదలకూరులోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు 100 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైబ్రంట్స్ ఆఫ్ కలాం సర్వేపల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ తురకా విజయ కుమారి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పాఠశాలలు, కళా శాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల సామాజిక, మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయని, దేశ భవిష్యత్తును దెబ్బతీసే ఈ సమస్యను పకడ్బందీగా అరికట్టాలని ఆమె పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చీఫ్ అడ్వైజర్ అన్నం సుబ్బారావు, డైరెక్టర్ ఏ.చంద్రశేఖర్, ఏ.ఓ జివిఆర్, ప్రిన్సిపాల్ లక్ష్మీ దుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

# రాచర్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించిన మంత్రి రవి కుమార్

**వరదయ్యపాలెం, (రాజధాని వార్తలు):** వరదయ్యపాలెం మండలంలోని రాచర్ల గ్రామంలో 220/132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంలు బుధవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదయ్యపాలెం మండల ప్రాంత అభివృద్ధిలో నేడు మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైందన్నారు. రాచర్ల గ్రామంలో నిర్మించిన ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపీ ట్రాన్స్‌కో) వారి 220/132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ 2019లో ప్రారంభమై, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆగిపోయిన ఈ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం రాగానే ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేసిందన్నారు. పారిశ్రామిక ప్రాంతానికి స్థానిక ప్రజలకు విద్యుత్ కోతలు లేని సరఫరాను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ సహకారంతో ఈ సబ్ స్టేషన్‌ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల ఇకపై మండలంలో లో-వోల్టేజ్ సమస్యలకు చెక్ పడనుందని, అంతరాయం లేని విద్యుత్ సరఫరా నిరంతర విద్యుత్ అందుతుందన్నారు. మెరుగైన విద్యుత్ సౌకర్యంతో ఈ ప్రాంతంలో కొత్త పరిశ్రమలు రావడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గ దర్శకత్వంలో యువ నాయకులు నారా లోకేష్ ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వెలుగుల దిశగా నడిపిస్తున్న ప్రభుత్వానికి, ఈ ప్రాజెక్ట్ పూర్తి కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సత్యవేడు తెలుగుదేశం పార్టీ



ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పిన్నమరెడ్డి యుగంధర్ రెడ్డి, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాల తెలుగుదేశం మండల అధ్యక్షులు, వరదయ్యపాలెం ఎంపీపీ పద్మప్రియ దామోదర్ రెడ్డి, ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి హరి, వరదయ్యపాలెం మండల అధ్యక్షులు దిలీప్ రాయల్, జనసేన మండల అధ్యక్షుడు, చిరంజీవి యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్, భాజాప సీనియర్ నాయకులు సిద్దులయ్య భాస్కర్ రెడ్డి పురుషోత్తం, దశయ్య, కన్నయ్య నాయుడు, ఎక్స్ ఎంపీపీ భారతి, డివిఎంసి నెంబర్ గుత్తి త్యాగరాజు, పరుచూరు మల్లికార్జున నాయుడు చిత్తూరు తిరుపతి జిల్లా జనసేన కార్యదర్శి తడ శ్రీనివాసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# 60 మంది వెట్టిచాకిరీ కార్మికులకు పునరావాసం

**తిరుపతి, (రాజధాని వార్తలు):** ప్రత్యేక ఆపరేషన్ ద్వారా ఒరిస్సాకు చెందిన 60 మంది వెట్టిచాకిరీ కార్మికులకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, లేబర్ శాఖల అధికారుల సమన్వయంతో పునరావాసం కల్పించారు. తిరుపతి గ్రామీణ ప్రాంతంలోని పలు ప్రదేశాలలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో 60 మంది వెట్టి చాకిరీ కార్మికులను గుర్తించి సురక్షితంగా రక్షించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కుటుంబాలు పుదిపట్ల గ్రామంలోని ఇటుక బట్టీలో ఐదు నెలలుగా పని చేస్తున్నాయి. ప్రతి కుటుంబానికి రూ.45,000 అడ్వాన్స్ ఇచ్చి వారానికి కేవలం రూ.1,000 చెల్లిస్తూ, వారిని బానిసలుగా చేసుకుంటున్నారు. ఇటుక బట్టిల యాజమాన్యం కార్మికులను తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, కలెక్టర్ తక్షణమే వ్యూహాన్ని మార్చి రెవెన్యూ, కార్మిక శాఖ అధికారులు, డీఎస్పీ, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, స్థానిక పోలీసుల బృందాలను పంపి కార్మికులను ట్రేస్ చేసి సురక్షితంగా కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. మహిళలు, పిల్లలతో సహా మిగిలిన వారిని గుర్తించి రక్షించి ఆహారం, ఆశ్రయం, భద్రత వంటి తక్షణ సహాయాన్ని అందించారు. రక్షించబడిన కార్మికులకు బుధవారం విడుదల సర్టిఫికెట్లు జారీ చేసి, పునరావాసానికి అర్హత కల్పించి, అనంతరం సురక్షి



తంగా రైలు ద్వారా ఒడిస్సాకు తరలిం చారు. వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం, 1976 ప్రకారం విచారణ ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. బట్టి యజమానులు మరియు వారి అనుచరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు కొనసాగించాలని ఆదేశించారు. ఇటువంటి కార్మికులను గుర్తించి రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, రెవెన్యూ, పోలీస్, కార్మిక శాఖ, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలీసెట్-2026 ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు



**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఈ నెల 25న జరగనున్న పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పాలీసెట్-2026) నిర్వహణకు పగడ్భందీగా ఏర్పాట్లు చేయడమైనదని జిల్లా రెవెన్యూ అధికారి తెలియజేసారు. జిల్లాలో తిరుపతి నందు 7 సెంటర్లు, శ్రీకాళహస్తినందు 2 సెంటర్లు, నాయుడుపేట నందు 3 సెంటర్లు, పుత్తూరు నందు 2 సెంటర్లు మరియు రేణిగుంట, వేంకటగిరి, సత్యవేడు నందు ఒక్కో సెంటర్లో మొత్తము 17 పరీక్ష కేంద్రాలలో 5143 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. పాలి టెక్నిక్‌లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పాలీసెట్-2026) పరీక్షల నిర్వహణకు సంబంధించిన లైసన్ అధికారులు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పాలీసెట్, ఎస్.వి.పాలిటెక్నిక్, తిరుపతి, సెంటర్ సూపర్వైజర్లు మరియు సంబందిత అధికారులతో బుధవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సమీక్ష సమావేశము నిర్వహించారు. పరీక్షలు ఉదయం 11.00 నుండి మ. 01.00 వరకు నిర్వహించబడునని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, వైర్లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని, పరీక్షా కేంద్రాల వద్ద పోలిస్ బందోబస్తు ఏర్పాటు, ఆర్టీసి బస్సు సౌకర్యం, విద్యుత్ అంతరాయం లేకుండా సంబందిత శాఖల అధికారులు చూడాలని, త్రాగునీరు, టాయిలెట్స్ సక్రమంగా ఉండాలని, అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టిసి వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైజన్ అధికారులు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పాలీసెట్, ఎస్వీ పాలిటెక్నిక్, తిరుపతి, సెంటర్ సూపర్వైజర్లు మరియు సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# కలిసికట్టే విజయానికి సోపానం

**- ఏపీ పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమా గోపాల్**

**- నెల్లూరు జిల్లా పద్మశాలి మహిళా అధ్యక్షురాలు సోమా అనురాధ**




**కోవూరు, (రాజధాని వార్తలు):** పద్మశాలీలు అందరూ ఐక్యంగా ఉండి ప్రతి విషయాలపై విజయం సాధిద్దామని రాష్ట్ర పద్మశాలి సంఘం, కార్యవర్గ సభ్యులు, నెల్లూరు జిల్లా పద్మశాలి సంఘ మహిళా అధ్యక్షురాలు, సోమా గోపాల్ అనురాధ దంపతులు ఒక ప్రకట నలో అన్నారు. జనం మనది బలం మనది అనే నినాదంతోనే ముందుకు సాగుదాం మన హక్కులను మనమే పరిరక్షికొందాము అని అన్నారు. బీసీవై పార్టీ అధినేత బోడి రామచంద్ర యాదవ్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో కూడా తాము పాల్గొన్నట్లు చెప్పారు. రాష్ట్రములో బీసీలకు తగిన న్యాయం జరగాలని బోడె రామచంద్ర యాదవ్ చేసిన పోరాటంలో రాష్ట్ర వ్యాప్తంగా మంచి స్పందన వచ్చిందని సోమా గోపాల్ అన్నారు.

# ఎమ్మెల్యే సోమిరెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

**పొదలకూరు, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమమును చూసి వైసీపీ నుండి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నట్లు పొదలకూరు మండలం బిరదవోలు పంచాయతీకి చెందిన 16 మంది వెల్లడించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సమక్షంలో టీడీపీ చేరారు. ఈ కార్యక్రమంలో వెన్నపూస శ్రీనివాసులు రెడ్డి, రమణారెడ్డి ఆధ్వర్యంలో చేరిన వీరికి నెల్లూరు వేదాయపాళెం కార్యాలయంలో ఆత్మీయ ఆహ్వానం పలికిన సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబుకూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి టీడీపీలో చేరుతున్న వారికి ఆత్మీయ స్వాగతం చెబుతున్నామన్న సోమిరెడ్డి కొత్త, పాత నాయకులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపు టీడీపీలో



చేరిన వారిలో బడుగు పెద్దమస్తానయ్య, శ్రీనివాసులు, రమణయ్య, మస్తాన్, రావుల దశయ్య, బడుగు మోహన్, శ్రీనివాసులు, చల్లా కోటేశ్వ రరావు, అచ్చి వెంకటేశ్వర్లు, మద్దూరి గురుబాబు, గుంజి చిన్న, సుబ్రహ్మణ్యం, మద్దూరి ప్రసాద్, పేట పెంచలయ్య, ప్రభాకర్ పలువురు ఉన్నారు.

# విశాఖ పర్యాటకానికి సరికొత్త చిరునామాగా త్రిశూల్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నిర్మాణ పనులను పరిశీలించిన వీఎంఆర్డిఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ విశాఖ పర్యాటకానికి సరికొత్త చిరునామాగా కైలాసగిరి పై నూతనంగా నిర్మించిన త్రిశూల్ ప్రాజెక్ట్ మారనుందని వీఎంఆర్డిఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ అన్నారు. బుధవారం సాయంత్రం కైలా సగిరిపై నిర్మాణంలో ఉన్న త్రిశూల్ పనులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. సుమారు 65 అడుగుల ఎత్తున డమ రుకంతో కూడిన త్రిశూల్ పరిసరాలు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా పచ్చదనం పెంపొందించాలని ఆదేశించారు. త్రిశూలం సమీపంలో డెకరేటెడ్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చెయ్యాలని సూచించారు. నిరంతరం త్రిశూల్ పరిసరాలు ఆధ్యాత్మికత వాతావరణం ఉట్టిపడేలా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ఓంకార నాదం వినిపించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. సందర్శకులు సేద తీరే విధంగా బెంచీలను ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే వారంలో త్రిశూల్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్రిశూల్ ప్రాజెక్టు గురించి విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డిఏ ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ భవాని శంకర్, కార్యనిర్వహక ఇంజనీర్ జెసిపి సింగ్, డిఎఫ్ఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.



RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్స్ కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు మహిళా నాయకత్వం, డిజిటల్ పాలన, వికసిత భారత్ లక్ష్యం

ఒక దేశం తన మూలాలను బలోపేతం చేసుకున్నప్పుడు మాత్రమే, దాని పురోగతి ఆకాశమంత ఎత్తుకు చేరుకుంటుంది. భారతదేశ మూలాలు పంచాయతీలే, ఆ పంచాయతీలకు నేడు మహిళలే ఆత్మ వంటివారు. 1993 ఏప్రిల్ 24వ తేదీన 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పాలనకు రాజ్యాంగ గుర్తింపు లభించింది, ఇది భారత ప్రజాస్వామ్యంలో ఓ నూతనాధ్యాయానికి నాంది పలికింది. మూడు దశాబ్దాల తర్వాత, పంచాయతీ రాజ్ సంస్థలు కేవలం పరిపాలనా విభాగాల స్థాయిని దాటి.. సామాజిక మార్పుకు, ఆర్థిక అభివృద్ధికి, ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి సజీవ ప్రయోగశాలలుగా ఎదిగాయి. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, పంచాయతీ రాజ్ వ్యవస్థ కొత్త శక్తిని, లక్ష్యాన్ని సంతరించుకుంది. అధికారం కేవలం దిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా, దేశంలోని ప్రతి మారుమూల గ్రామానికి చేరువ చేసేందుకు ఆయన కృషి చేశారు. 'వికసిత భారత్ 2047' అనే గొప్ప సంకల్పం 2.5 లక్షలకు పైగా గ్రామ పంచాయతీల పునాదిపై నిలవగా, దేశ జనాభాలోని దాదాపు 64% మందికి ఈ పంచాయతీలే జీవనాధారంగా నిలుస్తున్నాయి.

**ప్రజాస్వామ్య పాఠశాల : మహిళా నాయకత్వ ఎదుగుదల**

2026 జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఒక ప్రత్యేకమైన గర్వంతో జరుపుకుంటున్నారు. 'నారీ శక్తి వందన్ సమ్మేళనం'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. పంచాయతీ రాజ్ సంస్థలను దేశంలోనే మహిళా నాయకత్వానికి అతిపెద్ద పాఠశాలలుగా అభివర్ణించారు. గ్రామీణ భారతంలో ప్రతిరోజూ ఆవిష్కృతమవుతున్న గొప్ప మార్పుకు ఇదో గుర్తింపు. దేశవ్యాప్తంగా పంచాయతీ రాజ్ సంస్థలలో ఎన్నికైన ప్రతినిధుల మొత్తం సంఖ్య 32 లక్షల పై మాటే. తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుతం పదవిలో ఉన్న 24,41,781 మంది ప్రతినిధులలో 12,14,885 మంది మహిళలున్నారు. అంటే మొత్తం ప్రతినిధులలో వీరి వాటా దాదాపు 49.75 శాతం. రాజ్యాంగం ప్రకారం ఉండాల్సిన మూడో వంతు రిజర్వేషన్ కంటే ఒక అడుగు ముందుకేసి, 21 రాష్ట్రాలు, 02 కేంద్రపాలిత ప్రాంతాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ను కల్పించాయి. గడిచిన నాలుగేళ్లలో 33.50 లక్షల మంది మహిళా ప్రతినిధులు ప్రత్యేక నాయకత్వ, పాలనా శిక్షణను పొందారు. కేవలం 2025-26 ఏడాదిలోనే 9.37 లక్షల మంది మహిళా ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు, ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 47.7 శాతం అధికం. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పోషకాహారం, మహిళల భద్రతపై వారు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ గ్రామీణ అభివృద్ధికి ఒక కొత్త, అర్థవంతమైన దిశను అందించింది.

**సశక్త్ పంచాయితీ నేత్రీ అభియాన్ మరియు నారీ శక్తి వందన్ అధినియం**

సశక్త్ పంచాయితీ నేత్రీ అభియాన్ అనేది ఎన్నికైన మహిళా ప్రతినిధులకు వారి రాజ్యాంగబద్ధమైన హక్కులు, బాధ్యతలు, నాయకత్వ సామర్థ్యాలపై అవగాహన కల్పిస్తుంది. దీనికి అనుబంధంగా 'మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీ', నిర్భయ ఫండ్ కింద అమలు చేసిన 'నిర్భయ్ రహో' వంటి కార్యక్రమాలు.. గ్రామీణ పాలనలో మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు చట్టపరమైన అవగాహన, సామాజిక చైతన్యం, సాంకేతిక సాధికారతను ఏకం చేస్తాయి. లోక్సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33% రిజర్వేషన్లను కల్పించే నారీ శక్తి వందన్ అధినియం, భారత ప్రజాస్వామ్యంలో వారి పాత్రను శాశ్వతంగా సుస్థిరం చేస్తుంది. పంచాయితీ పాఠశాలల్లో రాటుదేలిన మహిళా నాయకులే భవిష్యత్తులో శాసనసభలు, పార్లమెంటులో మార్పుకు మార్గదర్శకులుగా నిలుస్తారు.

**16 వ ఆర్థిక సంఘం : వనరులలో భారీ పెరుగుదల**

ఏ సంస్థ అయినా ప్రభావవంతంగా పనిచేయడానికి ఆర్థిక సాధికారత చాలా ముఖ్యం. 16వ ఆర్థిక సంఘం 2026 నుంచి 2031 వరకు గ్రామీణ స్థానిక సంస్థల కోసం రూ. 4.35 లక్షల కోట్ల కేటాయింపులు చేసింది. ఇది 15 వ ఆర్థిక సంఘం కేటాయింపుల కంటే సుమారు 84% ఎక్కువ కావడం గమనార్హం. కేవలం 2026-27 ఏడాదిలోనే రూ. 1.40 లక్షల కోట్ల గ్రాంట్లను కేటాయించారు. సొంత ఆదాయ వనరుల పెంపుదల, పనితీరు ఆధారిత గ్రాంట్లపై దృష్టి పెట్టడం వల్ల పంచాయతీలలో జవాబుదారీతనం, ఆరోగ్యకరమైన పోటీ పెరిగాయి.

**సమ్మేళిత మరియు పారదర్శక పాలన**

పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ ఔర్ సబ్ కా ప్రయాస్' అనే మంత్రం అంతర్లీనంగా ఉంటుంది. ఈ-గ్రామ స్వరాజ్ వేదికగా గ్రామ పంచాయతీలు ఇప్పటివరకు మొత్తంగా రూ.3 లక్షల కోట్లకు పైగా ఆన్లైన్ చెల్లింపులు చేశాయి. ఈ వేదికతో 2.5 లక్షల కంటే ఎక్కువ పంచాయతీలు, 1.6 కోట్ల మంది విక్రేతలు అనుసంధానమై ఉన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కార్యచరణ కింద, 2025-26 ఏడాదిలో 2.5 లక్షలకు పైగా పంచాయతీలు తమ స్వంత అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సమ్మేళిత, సుస్థిర అభివృద్ధిని లక్ష్య ఆధారితంగా, ఫలితాల దిశగా తీసుకెళ్లడానికి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను 9 నేపథ్య నమూనాల ద్వారా స్థానిక అవసరాలకు అనుగుణంగా మలిచారు.

**పెసా ర్యాంకింగ్స్: షెడ్యూల్డ్ ప్రాంతాల పాలనలో కొత్త అధ్యాయం**

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పంచాయతీల విస్తరణ చట్టం అమలుపై కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సరికొత్త ప్రయత్నం చేసింది. చరిత్రలో తొలిసారిగా 2024-25 సంవత్సరానికి గాను రాష్ట్రాల వారీ ర్యాంకులను 2026, జనవరి 25న విడుదల చేసింది. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచడం, పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడం ఈ ర్యాంకుల ప్రధాన ఉద్దేశం. అలాగే, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గ్రామసభల ద్వారా సాగే స్వపరిపాలనను మరింత బలోపేతం చేయడం కోసం కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

2024-25 ర్యాంకింగ్స్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు ముందు వరుసలో నిలిచాయి. రాజస్థాన్, ఛత్తీస్గఢ్, తెలంగాణ రాష్ట్రాలు మంచి ప్రదర్శనకారుల విభాగంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ మరియు గుజరాత్ రాష్ట్రాలు ఆకాంక్షించే విభాగంలో చోటు దక్కించుకున్నాయి. ఈ ర్యాంకింగ్లు మొత్తం 10 పెసా రాష్ట్రాలను కవర్ చేస్తాయి. ఇవి పురోగతిని, సంస్థాగత సామర్థ్యాన్ని, భవిష్యత్తు సామర్థ్యాన్ని సూచించేందుకు ఒక నిర్మాణాత్మక సాధనంగా ఉపయోగపడ్డాయి. సహకార సమాఖ్య స్ఫూర్తితో, పెసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి మంత్రిత్వ శాఖ రాష్ట్రాలతో కలిసి పనిచేస్తూనే ఉంది.

**సభాసార్, ఏఐ-ఆధారిత పాలన : ప్రతి భాషలోనూ ప్రజాస్వామ్యం**

పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను క్షేత్రస్థాయి పాలనలోకి తీసుకు వచ్చింది. 2025 ఆగస్టు 14న ప్రారంభించిన 'సభాసార్' అనేది ఏఐ-ఆధారిత వాయిస్-టు-టెక్స్ట్ సాధనం 23 భారతీయ భాషలలో గ్రామసభల ప్రొసీడింగ్స్ను రికార్డు చేస్తుంది. 2026 జనవరి నాటికి 1,11,486 గ్రామ పంచాయతీలు ఇప్పటికే దీనిని వినియోగించాయి. స్థానిక పాలనలో భాగస్వామ్యానికి భాష ఇకపై అడ్డం కాదని నిరూపితం అయ్యింది.

**స్వామిత్వ : ఆస్తి హక్కుల ద్వారా ఆర్థిక సాధికారత**

స్వామిత్వ పథకం డ్రోన్ ఆధారిత సర్వేల ద్వారా సుమారు 3.30 లక్షల గ్రామాలలో ఆస్తి హక్కులను కల్పించింది. దీంతో 3.13 కోట్లకు పైగా ఆస్తి కార్డులు సిద్ధమయ్యాయి. ఈ పథకం గ్రామీణ గృహాలను బ్యాంకు రుణాలు, అధికారిక ఆర్థిక వ్యవస్థతో అనుసంధానిస్తోంది. దీనివల్ల ఆస్తిని ఒక ఆర్థిక వనరుగా ఉపయోగించుకునేందుకు వీలవుతోంది, భూమి, ఆస్తి సంబంధిత వివాదాలు తగ్గుతున్నాయి. అలాగే.. ఇది గ్రామ పంచాయతీలకు సుస్థిరమైన, పారదర్శకమైన ఆదాయ వనరుగా అవతరిస్తోంది.

**సంస్థాగత సామర్థ్య పెంపుదల**

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద, 2022-23 నుంచి ఇప్పటివరకు మొత్తం 1.62 కోట్లకు పైగా ఎన్నికైన ప్రతినిధులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు - కేవలం 2025-26 ఏడాదిలోనే 45.24 లక్షల కంటే ఎక్కువ మందికి శిక్షణ లభించింది. నాయకత్వ, నిర్వహణ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఐఐఎమ్, ఐఐటీలతో కుదుర్చుకున్న భాగస్వామ్యాలు, పంచాయతీ నాయకులకు ఆధునిక పాలనా నైపుణ్యాలను అందించాలనే నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. 'మేరీ పంచాయతీ, మేరా అధికార్' ప్రచారంలో భాగంగా, 2.15 లక్షలకు పైగా పంచాయతీలు 954 సేవలను అందజేస్తూ.. పౌర జాబితాలను సిద్ధం చేశాయి. జాతీయ పంచాయతీ అవార్డులు అత్యుత్తమ ప్రతిభను గుర్తించడంతో పాటు నిరంతర మెరుగుదల సంస్కృతిని ప్రేరేపిస్తున్నాయి.

వికసితభారత్ 2047: గ్రామాల నుంచి ఉదయిస్తున్న నవశకం

వికసిత భారత్ 2047 లక్ష్యం అనేది కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు.. సామాజిక న్యాయం, పర్యావరణ సమతుల్యత, సమ్మిళిత పురోగతిని కూడా కలిగి ఉంటుంది. 21 రాష్ట్రాలలో మహిళల భాగస్వామ్యం 50%నికి చేరుకోవడం, రూ.3 లక్షల కోట్లకు పైగా డిజిటల్ లావాదేవీలు, 23 భాషల్లో ప్రతిధ్వనిస్తున్న గ్రామ సభల స్వరం, 16వ ఆర్థిక సంఘం చేసిన చారిత్రాత్మక కేటాయింపులు, సశక్త్ పంచాయతీ నేత్రీ అభియాన్ - ఇవన్నీ కలిసి వికసిత భారత్ 2047 అనే మహా సౌధానికి పునాది రాళ్లుగా మారుతున్నాయి.

ఈ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ సందర్భంగా, తమ గ్రామాలను, దేశాన్ని మెరుగుపరచడానికి ప్రతి రోజూ అవిశ్రాంతంగా కృషి చేస్తున్న 14 లక్షల కంటే ఎక్కువ మంది మహిళా ప్రతినిధులకు మేము సెల్యూట్ చేస్తున్నాము. ఇదే 'నారీ శక్తి'. ఇదే 'నవ భారత్' తయారీ.

**(రచయిత : కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి)**

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan